


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 22-02-2026 | సంపుటి - 26 | సంచిక -274 | రూ : 4 | పేజీలు: 8


### కాంగ్రెస్ నిరసనలపై జగన్ ట్వీట్..

“అమోఘం” అంటూ

## నారా లోకేశ్ కౌంటర్

- యూత్ కాంగ్రెస్ తీరు సిగ్గుచేటంటూ జగన్ విమర్శ
- జగన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన మంత్రి లోకేశ్
- గతంలో పెట్టుబడులను దెబ్బతీశారంటూ జగన్‌పై ఆరోపణలు
- జగన్ నకిలీ సానుభూతి ప్రదర్శిస్తున్నారని లోకేశ్ ఎద్దేవా

2లో









# పనితీరుతోనే పదవులు

- పార్టీలో సీట్ల కోసం ఏ కోటాలూ ఉండవు
- కాంగ్రెస్ మెజార్టీ 2 నుంచి 12 శాతానికి పెంచాం
- అసెంబ్లీ ఎన్నికల్లో ఆధిక్యత 2% ఓట్లే
- మున్సిపల్ ఎన్నికల్లో 12 శాతానికి పెరిగింది
- పార్టీపై ప్రజల్లో పెరిగిన నమ్మకం, విశ్వాసమే కారణం: సీఎం రేవంత్‌రెడ్డి

2లో





### పీఎస్ఎల్వీ వైఫల్యంపై ఉన్నతస్థాయి దర్యాప్తు..

## కమిటీని నియమించిన కేంద్రం

2లో





## ఢిల్లీ ఎర్రకోట వద్ద పేలుళ్లకు లష్కరే కుట్ర!


- ఇతర నగరాల్లోనూ ఐఈడీ పేలుళ్లకు ప్లాన్
- ప్రముఖ దేవాలయాలే లక్ష్యంగా దాడులు జరిగే ఛాన్స్
- ఇస్లామాబాద్ మసీద్ పేలుడుకు ప్రతీకారంగా ఉగ్రవాదుల కుట్రలు

2లో

## ఇంటింటికీ డిజిటల్ సేవలు

- టీ ఫైబర్ ఆధ్వర్యంలో అత్యంత వేగవంతమైన ఇంటర్నెట్ కనెక్షన్లు
- ఇప్పటికే 26 జిల్లాల్లో ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లతో రింగ్ కనెక్టివిటీ
- ఈ పరిధిలోకి తాజాగా రంగారెడ్డి, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలు
- సీఎం, ఐటీ మంత్రి చొరవతో కేంద్రం రూ.3,185 కోట్ల కేటాయింపు

2లో



# ముగిసిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026

## న్యూఢిల్లీ డిక్లరేషన్‌కు 88 దేశాల ఆమోదం





2లో

- ఏఐపై ప్రపంచ ఏకాభిప్రాయం
- సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' స్ఫూర్తితో డిక్లరేషన్ రూపకల్పన
- ఏడు కీలక స్తంభాల ఆధారంగా ఏఐపై అంతర్జాతీయ సహకారానికి పిలుపు
- ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు కోసం ఏఐని ఉపయోగించాలని తీర్మానం

## కాంగ్రెస్ ప్రవర్తన సిగ్గుచేటు

- అంతర్జాతీయ సదస్సులో అర్ధనగ్న ప్రదర్శన దారుణం
- రాష్ట్రంలో బూతులు తిట్టేవారిని పరామర్శిస్తున్నారు
- వినుకొండ స్వచ్ఛాంధ్ర సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు


2లో



### యువతులతో భారతీయుల క్లబ్బులు, బార్లపై దాడులు...

## జైషే అంతర్జాతీయ కుట్ర!

2లో



### నక్సల్స్ ను ఏరివేసినట్లే చొరబాటుదారులను కూడా

## ఏరివేయడం సాధ్యమే: అమిత్ షా

2లో



# పనితీరుతోనే పదవులు

హైదరాబాద్: "డీసీసీ అధ్యక్షుల ప్రతి చర్యనూ మేం గమనిస్తున్నా ప్రతిరోజు మార్కులు వేయం. మనం ఎంత బాగా చదువుకున్నా ఏడాదికి ఒకసారే పరీక్షలు పెడతారు. పదవి వచ్చింది కదా.. ఏం చేసినా ఎవరు చూస్తారులే... ఎన్నికల ముందు ఎవరో ఒకరిని పట్టుకుంటే ఏదో ఒక కోటాలో సీటు వస్తుందని కొందరు అనుకుంటున్నారు. ఇక ఏ కోటాలూ ఉండవు. పార్టీలో మెరిట్ కోటా మాత్రమే ఉంటుంది. పార్టీ జిల్లా అధ్యక్ష పదవిని దుర్వినియోగం చేసుకుంటే మిమ్మల్ని ఆ దేవుడు కూడా బాగుచేయలేడు. సద్వినియోగం చేసుకుంటే సీఎం స్థాయికైనా ఎదగడానికి ఈ పదవి మీకు ఉపయోగపడుతుంది'' అని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. శనివారం వికారాబాద్‌లో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులకు ఏర్పాటు చేసిన పదిరోజుల శిక్షణ శిబిరం ప్రారంభ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం పట్ల ఉన్న నమ్మకం, విశ్వాసం వల్లనే తెలంగాణ కాంగ్రెస్‌కు ఎన్నికల్లో ఓట్ల ఆధిక్యత పెరిగిందని అన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికలలో భారాస కంటే కాంగ్రెస్‌కు అదనంగా వచ్చిన మెజార్టీ 2 శాతం ఓట్లే అయినా ఆ తర్వాత 4 నెలలకే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 4 శాతానికి, తాజా మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో 12 శాతానికి పెరిగిందని ఆయన వివరించారు. ఇందుకు ప్రజల ఆదరణతో పాటు కాంగ్రెస్ కార్యకర్తల శ్రమ కారణమని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తే డీసీసీ అధ్యక్షులకు గౌరవం పెరుగుతుందని, పైరవీలు చేస్తారనే ముద్ర పడితే అందరికీ లోకువవుతారని.. ఛీత్కారాలు వస్తాయని సీఎం అన్నారు. "నేను జడ్పీటీసీ సభ్యుని స్థాయి నుంచి సీఎం స్థాయికి చేరా. ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు అప్పటి సీఎం వై.ఎస్.ను నేను ఎప్పుడు కలిసినా 'వాట్ హీరో' అని నన్ను గౌరవంగా పలకరించేవారు. ఏపీలో కాంగ్రెస్ నేతలు పడుతున్న ఇబ్బందులు చూడాలి. వారితో పోలిస్తే తెలంగాణలో పార్టీ నేతలు ఎంత సౌకర్యంగా ఉన్నారో గుర్తించాలి. రెండు తెలుగు రాష్ట్రాల్లో పార్టీని అభివృద్ధి చేసుకోవాలి. రెండు రాష్ట్రాలు కలసి అభివృద్ధి చెంది దేశానికి ఆదర్శంగా నిలవాలి.

**ఈ దేశం ఆత్మనే కాంగ్రెస్**

ఈ దేశం ఆత్మనే కాంగ్రెస్ పార్టీ. దేశాన్ని, కాంగ్రెస్‌ను విడదీసి చూడలేం. ఈ ఆత్మను దెబ్బతీయాలని భాజపా వంటివి కుట్ర చేస్తున్నాయి. పార్లమెంటులో రాహుల్‌గాంధీని మాట్లాడనివ్వడం లేదు. గాంధీ కుటుంబాన్ని అవినీతి ఆరోపణలతో అవమానించేలా మాట్లాడేందుకు భాజపా ప్రయత్నిస్తోంది. దేశం కోసం ప్రాణాలిచ్చిన గాంధీ కుటుంబానికి ఈరోజు సొంత ఇల్లు కూడా లేదు. వారికి డబ్బులు ఒక లెక్కనా? నిజంగా గాంధీ కుటుంబానికి డబ్బులు కావాలంటే కాంగ్రెస్ కార్యకర్తలు పోగుచేస్తే రూ.పదివేల కోట్లు జమ అవుతాయి. నిజంగా ఆ కుటుంబానికి ఆర్థిక అవసరాలు ఉన్నాయంటే... తెలంగాణ నుంచి మనమందరం తలా ఒక చేయి వేస్తే రూ.వెయ్యి కోట్లు పోగేసి ఇవ్వగలిగిన శక్తి ఈరోజు కాంగ్రెస్‌పార్టీకి ఉంది. గాంధీ కుటుంబాన్ని అవమానపరచాలని రాజకీయంగా అడ్డుతొలగించాలని చూస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో 63 శాతం బీసీలను ఎన్నుకున్నామంటే కాంగ్రెస్ వల్లనే సాధ్యమైంది.

**డిజిటల్ సభ్యత్వాలతో...**

గతంలో గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర కమిటీలు వేసే ముందు సభ్యత్వాలను నమోదు చేయమంటే గ్రామంలో ఒక నాయకుడు తనకు తెలిసినవారి, కావాల్సిన వారి పేర్లను రాసి ఇచ్చేవారు. అలా కాదని డిజిటల్ సభ్యత్వాల కోసం యాప్ రూపొందించి 42 లక్షల మంది సభ్యత్వాలను నమోదు చేశాం. ఏఐసీసీ నేతలకు అనుమానం వచ్చి ర్యాండమ్‌గా కొన్ని వేల నంబర్లకు ఫోన్ చేసి తనిఖీ చేస్తే వందశాతం వాస్తవమేనని తేలింది. అత్యధిక సభ్యత్వాలు చేసిన వారిని గాంధీభవన్‌కు పిలిపించి రాహుల్‌గాంధీతో సన్మానం చేయించాం.

**సీపీఐ ఒక్కటే....**

ఈ దేశంలో కాంగ్రెస్‌తోపాటు వందేళ్ల పార్టీ చరిత్ర కలిగింది సీపీఐ ఒక్కటే. ఆ తరవాత రాజకీయ పార్టీలుగా ఏర్పడినవి ఈరోజు 'కాంగ్రెస్ ముక్త భారత్' నినాదంతో ఈ దేశానికే ప్రమాదకరంగా మారుతున్నాయి. బ్రిటిషర్లు కూడా మహాత్మాగాంధీని టచ్ చేయడానికి ధైర్యం చేయలేదు. కానీ భారతీయ జనతాపార్టీ వారసత్వం ఉన్నవారు గాంధీ ప్రాణాన్నే బలిగొన్నారు. మహాత్మాగాంధీ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ఈ దేశం కోసం ప్రాణాలిచ్చిన వారసత్వంతో రాహుల్‌గాంధీ కష్టమనేది తెలియకుండానే ఈ దేశానికి ప్రధాని కావాలి. అయినా 150 రోజులు పాదయాత్ర చేసి పేదవారిని చేరాలని రాహుల్‌గాంధీ ప్రయత్నించారు. ఆ ప్రయత్నమే జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులకు స్ఫూర్తి కావాలి. దేశంలో రాజ్యాంగాన్ని మార్చాలని, రిజర్వేషన్లను రద్దుచేయాలని జరుగుతున్న కుట్రను ఎదుర్కొనేలా మీకు ఇస్తున్న ఈ శిక్షణ ఎంతో ప్రత్యేకమైనది'' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, శిక్షణ కార్యక్రమం సమన్వయకర్త సచిన్‌రావు, ఏఐసీసీ కార్యదర్శి సచిన్‌సావంత్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాంమోహన్‌రెడ్డి, వెడ్మ బొజ్జు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నిరసనలపై జగన్ ట్వీట్...

### "అమోఘం" అంటూ నారా లోకేశ్ కౌంటర్

ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాలు విప్పి నిరసన తెలిపిన వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై వైసీపీ అధినేత జగన్ ట్వీట్ చేయడం తెలిసిందే. "ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ప్రవర్తించిన తీరు సిగ్గుచేటు. మన రాజకీయాలు ఎటు వెళ్తున్నాయి? రాజకీయ విభేదాలు ఎలా ఉన్నా, ప్రపంచం ముందు దేశం పరువు తీయకూడదు" అని జగన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. దేశం విషయంలో అందరం ఐక్యంగా నిలబడాలని హితవు పలికారు. జగన్ వ్యాఖ్యలపై మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. అసలు దేశ ప్రతిష్ఠ గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదంటూ విరుచుకుపడ్డారు. జగన్ హిపోక్రసీ (కపటత్వం) అమోఘమని లోకేశ్ ఎద్దేవా చేశారు. "భారతదేశ పెట్టుబడుల వాతావరణాన్ని అందరికంటే ఎక్కువగా దెబ్బతీసిన వ్యక్తి, ఇప్పుడు నకిలీ సానుభూతి ప్రదర్శిస్తున్నారు" అని విమర్శించారు. ఈ సందర్భంగా జగన్ గతంలో తీసుకున్న పలు నిర్ణయాలను లోకేశ్ ప్రస్తావించారు. 2017లో ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌ను అడ్డుకునేందుకు ఎయిర్‌పోర్టులో ధర్నా చేయడం, 2019లో విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయడం, 2020లో అమరావతిలో సింగపూర్ ప్రభుత్వ పెట్టుబడులను వెనక్కి పంపడం, 2025లో ప్రభుత్వ నిధుల సమీకరణను అడ్డుకోవాలని ఆర్‌బీఐకి లేఖ రాయడం వంటి చర్యలను గుర్తుచేశారు. ఇప్పుడు ఏఐ సమ్మిట్ గురించి ఆందోళన చెందుతున్నట్లు నటించడం విడ్డూరంగా ఉందని లోకేశ్ వ్యాఖ్యానించారు.

## పీఎస్ఎల్వీ వైఫల్యంపై ఉన్నతస్థాయి దర్యాప్తు.. కమిటీని నియమించిన కేంద్రం

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఇటీవల చేపట్టిన పీఎస్ఎల్వీ సీ62 రాకెట్ ప్రయోగం విఫలం కావడంపై కేంద్ర ప్రభుత్వం ఉన్నతస్థాయి విశ్లేషణ కమిటీని ఏర్పాటు చేసింది. ప్రధానికి గతంలో ముఖ్య శాస్త్రీయ సలహాదారుగా పనిచేసిన కె. విజయరాఘవన్ ఈ కమిటీకి ఛైర్మన్‌గా, ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ ఎస్. సోమనాథ్ కోఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఈ ఏడాది జనవరి 12న శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి పీఎస్ఎల్వీసీ62 రాకెట్‌ను ప్రయోగించిన విషయం తెలిసిందే. అయితే, మూడో దశ సాలిడ్ మోటారులో సాంకేతిక సమస్య తలెత్తడంతో ప్రయోగం విఫలమైంది. ఈ ఘటనలో డీఆర్‌డీఓకు చెందిన కీలకమైన 'అన్వేష' ఉపగ్రహంతో పాటు మొత్తం 16 ఉపగ్రహాలు కక్ష్యలోకి చేరలేదు. పీఎస్ఎల్వీ రాకెట్ వరుసగా రెండోసారి విఫలం కావడంతో కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తోంది. గతంలో 2025 మే నెలలో ప్రయోగించిన పీఎస్ఎల్వీసీ61 కూడా దాదాపు ఇలాంటి కారణాలతోనే విఫలమైంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం తాజా వైఫల్యంపై దర్యాప్తునకు ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ కమిటీ సభ్యులు ఇప్పటికే శ్రీహరికోటలోని షార్ కేంద్రాన్ని, తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌ను సందర్శించి విచారణ ప్రారంభించారు. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా భవిష్యత్తులో చేపట్టే ప్రయోగాలపై ఇస్రో నిర్ణయం తీసుకోనుంది.

## నక్సల్స్‌ను ఏరివేసినట్లే చొరబాటుదారులను కూడా ఏరివేయడం సాధ్యమే: అమిత్ షా

నక్సల్స్‌ను ఏరివేసినట్లే చొరబాటుదారులను కూడా ఏరివేయడం సాధ్యమేనని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. అసోంలోని కామ్‌రూప్‌లో పోలీస్ శాఖ 10వ బెటాలియన్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్రమ వలసదారులను కేవలం ఓటరు జాబితా నుంచి మాత్రమే కాదని, దేశం నుంచి కూడా తొలగిస్తామని అన్నారు. చొరబాటుదారులు ఆక్రమించిన స్థలాల నుంచి వారిని తరిమికొడితే మరోచోట నివాసం ఏర్పరుచుకునే అవకాశం ఉందని, కాబట్టి వారిని దేశం నుంచే పంపించివేయాలని అన్నారు. అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని గతంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ చెప్పారని గుర్తుచేశారు. వారు చెప్పిన మాటలు విశ్వసించవద్దని, ఎందుకంటే వారికి చొరబాటుదారులే ఓటు బ్యాంకు కాబట్టి వారిని పంపించలేరని అన్నారు. చొరబాటుదారులను రక్షించాలనే హస్తం పార్టీ విధానాలు అసోంకు ముప్పుగా పరిణమించాయని విమర్శించారు. ఒకవేళ వారిపై చర్యలు తీసుకునే విషయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంటే పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆ విషయాన్ని పొందుపర్చాలని డిమాండ్ చేశారు. వచ్చే ఐదేళ్ల కాలంలో అసోంను పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు.

## ముగిసిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్2026..

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) రంగంలో అంతర్జాతీయ సహకారానికి సంబంధించి భారత్ కీలక ముందడుగు వేసింది. న్యూఢిల్లీ వేదికగా జరిగిన మెగా 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ సదస్సులో 'న్యూఢిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్'ను ఆమోదించారు. భారత్‌తో సహా 88 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు దీనికి మద్దతు తెలపడం ప్రపంచ ఏకాభిప్రాయానికి నిదర్శనంగా నిలిచింది. ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు కోసం ఏఐని ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై ఈ డిక్లరేషన్ ఒక స్పష్టమైన మార్గాన్ని నిర్దేశిస్తోంది. 'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' (అందరి సంక్షేమం, అందరి ఆనందం) అనే భారతీయ తాత్విక సూత్రాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ డిక్లరేషన్‌ను రూపొందించారు. ఏఐ ద్వారా లభించే ప్రయోజనాలు ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ సమానంగా అందాలనే ఆశయాన్ని ఇది పునరుద్ఘాటించింది. "వసుధైక కుటుంబం" (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అనే భావనతో, అన్ని దేశాలు తమ పౌరుల ప్రయోజనాల కోసం ఏఐని అభివృద్ధి చేసి, వినియోగించుకునేలా వనరులను అందుబాటులోకి తీసుకురావాల్సిన ప్రాముఖ్యతను ఈ తీర్మానం నొక్కి చెప్పింది.

## యువతులతో భారతీయుల క్లబ్బులు, బార్లపై దాడులు...

### జైషే అంతర్జాతీయ కుట్ర!

పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ భారతీయులే లక్ష్యంగా ఒక భారీ అంతర్జాతీయ కుట్రకు తెరలేపింది. ప్రపంచవ్యాప్తంగా భారతీయులు యాజమానులుగా ఉన్న నైట్‌క్లబ్బులు, పబ్‌లు, బార్లలో దాడులు చేసేందుకు యువతులను నియమించుకుంటోంది. ఈ సంచలన విషయాన్ని భారత నిఘా వర్గాలు పసిగట్టాయి. జైషే తన మహిళా విభాగాన్ని ఈ ఆపరేషన్ కోసం ప్రత్యేకంగా రంగంలోకి దించింది. అందంగా ఉన్న యువతులను ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇస్తున్నారు. అనంతరం వీరిని ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో భారతీయులు నిర్వహిస్తున్న క్లబ్బులలో ఉద్యోగాల్లో చేర్పిస్తారు. అక్కడ పనిచేస్తూ, ఆ ప్రదేశంపై పూర్తి సమాచారం (రెక్కీ) సేకరించడం వీరి ప్రాథమిక విధి అని ఓ అధికారి తెలిపారు. రెక్కీ పూర్తయిన తర్వాత, అదే మహిళలతో దాడులు చేయించాలని జైషే ప్లాన్ చేస్తోంది. ప్రస్తుతం అమెరికా, యూకే, థాయ్‌లాండ్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, దుబాయ్ వంటి దేశాల్లోని లక్ష్యాలను గుర్తిస్తున్నట్లు సమాచారం. ఈ కుట్రలో పాకిస్థాన్ ప్రమేయం బయటపడకుండా ఉండేందుకు, పాకిస్థానీ మహిళలను తక్కువ సంఖ్యలో వాడుకుని, ఉజ్బెకిస్థాన్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ వంటి దేశాల నుంచి ఎక్కువ మందిని రిక్రూట్ చేసుకుంటున్నారు. ఐఎస్ఐ సహకారంతో వీరికి నకిలీ గుర్తింపు పత్రాలు సృష్టించి ఉద్యోగాల్లో చేర్పిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి ఒకరు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తించిన అన్ని ప్రదేశాల్లో ఏకకాలంలో దాడులు జరిపి సంచలనం సృష్టించాలని జైషే భావిస్తోంది. ఈ భారీ ఆపరేషన్ కోసం పెద్ద ఎత్తున నిధులు అవసరం కావడంతో, 'గాజా సహాయం' పేరుతో పాకిస్థాన్, గల్ఫ్ దేశాల్లో గత నాలుగు నెలలుగా విరాళాలు సేకరిస్తోంది. వ్యక్తిగత నష్టాలు, వేధింపులకు గురైన చరిత్ర ఉన్న మహిళలనే జైషే ఎక్కువగా లక్ష్యం చేసుకుంటోంది. ఇలాంటి వారు సులభంగా ఆత్మాహుతి దళ సభ్యులుగా మారతారని, వారిపై అనుమానం కూడా రాదని ఉగ్రవాద నిరోధక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ అంతర్జాతీయ కుట్రపై భారత ఏజెన్సీలు అప్రమత్తంగా ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాయి.

## ఢిల్లీ ఎర్రకోట వద్ద పేలుళ్లకు లష్కరే కుట్ర!

ఢిల్లీలోని ఎర్రకోట, చాందినీ చౌక్‌లోని ఒక ఆలయం మరియు దేశవ్యాప్తంగా ఉన్న ఇతర ప్రధాన దేవాలయాల సమీపంలో పేలుళ్లు జరపాలని పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా ప్లాన్ చేస్తోందని సమాచారం. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని ఒక మసీదులో ఫిబ్రవరి 6న జరిగిన పేలుడుకు ప్రతీకారంగా ఈ దాడులకు ప్లాన్ చేస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలకు సమాచారం అందినట్లు తెలుస్తోంది. భద్రతా సంస్థల సమాచారం ప్రకారం, లష్కరే తోయిబా ఉగ్రవాదులు ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్ (ఐఈడీ) ద్వారా దాడికి కుట్ర పన్నుతున్నట్లు తెలిసింది. ఫిబ్రవరి 6న ఇస్లామాబాద్‌లోని మసీదులో జరిగిన పేలుడుకు ప్రతీకారం తీర్చుకోవడమే ఈ కుట్ర వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని భద్రతా బలగాలు వెల్లడించాయి.

## ఇంటింటికీ డిజిటల్ సేవలు

హైదరాబాద్: రాష్ట్రంలో ఇంటింటికీ అత్యంత వేగవంతమైన డిజిటల్ సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. టీ ఫైబర్ ఆధ్వర్యంలో అన్ని పల్లెల్లోనూ ప్రతి ఇంటికి స్వల్ప ఖర్చుతో ఇంటర్నెట్ కనెక్షన్లు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే 26 జిల్లాల్లోని సుమారు 9,000 గ్రామాలకు ఆప్టికల్ ఫైబర్ కేబుల్ రింగ్ కనెక్టివిటీని ఏర్పాటు చేయగా.. ఈ పరిధిలో ఇప్పటివరకు లేని రంగారెడ్డి, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలను కూడా చేర్చారు. ఈ కనెక్టివిటీ వల్ల వైరు తెగి ఎక్కడైనా అంతరాయం కలిగినా ఆ గ్రామంలో సేవలు నిలిచిపోవు. అన్ని గ్రామపంచాయతీలను ఇదే విధానంలో అనుసంధానం చేస్తారు. ఈ మూడు జిల్లాల్లో రింగ్ కనెక్టివిటీ కోసం కేంద్ర ప్రభుత్వానికి పలు సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు వినతి పత్రాలు అందజేశారు. తాజాగా భారత్ నెట్ సవరణ కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో రింగ్ కనెక్టివిటీకి కేంద్రం రూ.432 కోట్లు మంజూరు చేసింది. వీటితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లను పదేళ్ల పాటు మెయింటెనెన్స్ చేసేందుకు మరో రూ.2,697 కోట్లను, పరిపాలన వ్యయం నిధులు కలిపి డిజిటల్ సేవల కోసం రాష్ట్రానికి రూ.3,185 కోట్లు కేంద్రం మంజూరుచేసింది. ప్రస్తుతం టీ ఫైబర్ ఆధ్వర్యంలో రింగ్ కనెక్టివిటీ ఉన్న జిల్లాల నుంచి నాలుగు గ్రామాలను ఎంపిక చేసుకొని అక్కడి అన్ని ఇళ్లకు ఉచితంగా ఇంటర్నెట్ కనెక్షన్లను అందిస్తున్నారు. ఈ ప్రయత్నం విజయవంతం కావడంతో కేంద్ర ప్రభుత్వం దీన్ని సక్సెస్‌ఫుల్ మోడల్‌గా గుర్తించింది. రింగ్ కనెక్టివిటీ లేని జిల్లాలకు కూడా ఈ విధానాన్ని వర్తింప చేయడానికి ఆమోదం తెలిపింది.

## కాంగ్రెస్ ప్రవర్తన సిగ్గుచేటు

నరసరావుపేట: 'ఏఐ సదస్సులో కాంగ్రెస్ ప్రవర్తించిన తీరు ఆవేదన కలిగించింది. 70కి పైగా దేశాల ప్రతినిధులు పాల్గొన్న సదస్సులో కాంగ్రెస్ కార్యకర్తల అర్ధనగ్న ప్రదర్శన దేశ ప్రతిష్ఠకు నష్టం. ఇలాంటి చర్యల్ని ఖండిస్తున్నా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. అంతకు ముందు మంత్రులు నారాయణ, గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభితో కలిసి స్వచ్ఛ రథాలను ప్రారంభించారు. చంద్రబాబు మాట్లాడుతూ 'ఏఐ సదస్సులో ప్రపంచంలోని చాలా దేశాలు ఆవిష్కరణలు ప్రదర్శించగా, మన ఆవిష్కరణల్ని చూపించి ప్రపంచ దేశాల అభినందనలు అందుకున్నాం. ఐటీ, ఏఐల్లో ముందుండటంతో ప్రపంచ నాలెడ్జ్ ఎకానమీకి నాయకత్వం వహించే ఏకైక దేశం మనదేనని అందరూ కితాబిచ్చారు. మన యువత ప్రయోజనాలు కాపాడాల్సిన కాంగ్రెస్ బాధ్యతారహితంగా వ్యవహరించడం దుర్మార్గం. మన రాష్ట్రంలోనూ వైకాపా వంటి పార్టీని ఎప్పుడూ చూడలేదు. నేను బాంబులకు భయపడలేదు. అలిపిరిలో నాపై దాడి చేసినప్పుడు వేంకటేశ్వరస్వామి నన్ను కాపాడారు. ఆ స్వామికి అపచారం కలిగే పనులు వైకాపా నాయకులు చేస్తున్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా బూతులే తిడుతున్నారు. ఇది న్యాయమేనా? మనం తిట్టించుకోవడానికి రాజకీయం చేస్తున్నామా? రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తున్నారు. రాష్ట్రాన్ని గంజాయిమయం చేశారు. మదనపల్లెలో ఒకరు గంజాయి తాగి మృగంలా ప్రవర్తించారు. గంజాయి తాగి ఆడబిడ్డల జోలికొస్తే అదే చివరి రోజవుతుందని చెప్పిన మాటకు కట్టుబడి ఉంటాను. అలాంటి మృగాలు జైల్లో ఉండాలి లేదా ఉరిశిక్షతో పైకి పోవాలి.. చట్టం తన పని తాను చేస్తుంది' అని పేర్కొన్నారు.

*** నెయ్యే కాదని సిట్ తేల్చింది**

'తిరుమల తిరుపతి దేవస్థానంలో నాసిరకం ప్రసాదాలు గత ఐదేళ్లూ అందరూ తిన్నారు. వైకాపా వారు భక్తుల నమ్మకాన్ని దెబ్బతీశారు. మేము పవిత్రతను కాపాడుతున్నాం. ఎన్నికల్లో నేను ఇచ్చిన హామీ ప్రకారం తితిదే ఈవోగా శ్యామలరావును నియమించి ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాం. నెయ్యి నాణ్యంగా లేదని ల్యాబ్‌కు పంపితే జంతు కొవ్వు ఉందని తేల్చారు. ప్రజలకు తెలియజేయకపోతే అప్రతిష్ఠ వస్తుందని ల్యాబ్ రిపోర్టునే నేను ప్రకటించాను. దీన్ని రాజకీయం చేసి సుప్రీంకోర్టు వరకు వెళ్లేలా చేశారు. సిట్ వేశాం. అసలు నెయ్యే కాదని, రసాయనాలు ఉన్నాయని తేల్చింది. సిట్ స్పష్టంగా చెప్పినా.. తిరిగి దాన్ని మాపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. హెరిటేజ్ కంపెనీని తీసుకొచ్చి నా పేరు ప్రస్తావించి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కరడుగట్టిన నేరస్థులతో రాజకీయం చేయాలా? రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత నా ఒక్కడిపైనే లేదు.. మీ అందరిపై ఉంది. చెడ్డవారిని దూరం పెట్టినప్పుడే రాజకీయాల్లో ప్రక్షాళన మొదలవుతుంది. నాకెందుకులే అని ఇంట్లో కూర్చుంటే మార్పు రాదు. ప్రజల కోసమే నాడు జైలుకెళ్లాను.

# బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్

* **రంగారెడ్డి జిల్లా,ప్రజాస్పూర్తి**



రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ గా (స్థానిక సంస్థలు) ప్రతిమా సింగ్ తిరిగి శుక్రవారం తన బాధ్యతలు స్వీకరించారు. జిల్లా అదనపు కలెక్టర్ గా కొనసాగిన ప్రతిమాసింగ్ ప్రసూతి సెలవులపై వెళ్లారు. సెలవులు ముగియడం తో తిరిగి అదనపు కలెక్టర్ గా (స్థానిక సంస్థలు) బాధ్యతలు తీసుకున్నారు.

# ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

* **బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్పూర్తి ) : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. గాజుల రామారం డివిజన్ ఆర్కె లేఔట్ సాయిబాబా దేవాలయం తృతీయ వార్షికోత్సవ వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సద్గురు సాయినాధుడి దివ్యాశీష్సులు భక్తులందరిపై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు బాల భాస్కర్, శివప్రసాద్, మల్లేశ్వరరావు, అశోక్ కుమార్, నాగేశ్వరరావు, అరుణ్, ప్రమోద్, జగన్మోహన్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆంజనేయులు, కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, జశ్వంత్, స్వామి, వైఎస్ఆర్, నవీన్, ప్రసాద్, మహిళా నాయకురాలు అర్పితా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక లారీ పట్టివేత



ప్రజాస్పూర్తి ,జన్నారం : పాత అనుమతి పత్రాలతో ఇసుకను తరలిస్తున్న లారీని అటవిశాఖ అధికారులు పట్టుకుని సీజ్ చేసినట్లు ఇందన్ పల్లి రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల వైపు నుంచి ఉట్నూర్ వైపు వెళుతున్న టీఎస్04యూబీ8546 నంబర్ గల లారీని ఇందన్పల్లి చెక్ పోస్టు వద్ద సిబ్బంది. తనిఖీ చేశారు. వారు చూపించిన అనుమతి పత్రం ఒక విధంగా, క్యూఆర్ కోడ్ ద్వారా పరిశీలించగా మరో విధంగా కనిపించడంతో అనుమానంతో మైనింగ్ అధికారులను సంప్రదించినట్లు తెలిపారు. లారీ తీసుకువచ్చిన క్వారీ నుంచి ప్రస్తుతం ఇసుక తోడటం లేదని మైనింగ్ అధికారులు తెలిపినట్లు రేంజ్ అధికారి తెలిపారు. క్యూఆర్ కోడ్ లో ఈనెల 3 వ తేదిన అనుమతి ఇచ్చినట్లు ఉందన్నారు. దీంతో లారీని సీజ్ చేసి రేంజ్ కార్యాలయంలో పెట్టామన్నారు. ఇక నుంచి వే బిల్లులను క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందని పేర్కొన్నారు.

# 102 అంబులెన్స్ లో ఉత్తమ సేవలు అందించిన పైలెట్ కొట్టె రవి కుమార్ కు పురస్కారం



ప్రజాస్పూర్తి ,జన్నారం : తెలంగాణ వ్యాప్తంగా 102 అంబులెన్స్ ద్వారా అత్యుత్తమ సేవలను అందించినందుకు 102 పైలెట్ కొట్టె రవి కుమార్ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ చేతుల మీదుగా స్టార్ పైలెట్ అవార్డును అందుకున్నారు. అలాగే 108 అంబులెన్స్ మెడికల్ టెక్నీషియన్ చుంచు తిరుపతి కూడ కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ సామ్రాట్, మంచిర్యాల జిల్లా కోఆర్డినేటర్ కొండలరావు మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా 102 అంబులెన్స్ ద్వారా అత్యుత్తమ సేవలను అందించడంలో మంచిర్యాల జిల్లా ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. అనంతరం పురస్కారాలు అందుకున్న పైలెట్ కొట్టే రవికుమార్, మెడికల్ టెక్నీషియన్ చుంచు తిరుపతి లను వారు అభినందనలు తెలిపారు.

# పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

**: డి ఐ ఈ ఓ దస్రు నాయక్..**



నల్లగొండ, ప్రజాస్పూర్తి : ఈనెల 25 నుండి మార్చి 13 వరకు జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి దస్రు నాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ జిల్లాలో ఫస్ట్ ఇయర్ జనరల్ 11807 విద్యార్థులు ఒకేషనల్ 2117 మంది విద్యార్థులు. సెకండ్ ఇయర్ జనరల్ 11733 మంది విద్యార్థులు ఒకేషనల్ 2248 మంది విద్యార్థులు, పరీక్షలకు హాజరు కాలినట్లు తెలిపారు పరీక్షలు ఉదయం 9 నుండి 12 గంటల వరకు నిర్వహిస్తామని జిల్లాలో 48 సెంటర్లలో పరీక్షలు జరుగుతాయని పరీక్షలు జరిగే ప్రాంతాలలో 144 సెక్షన్ తో పాటు జిరాక్స్ సెంటర్లు మూసివేస్తామన్నారు పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి ఇద్దరు ఫ్లైయింగ్ స్కాడు ముగ్గురు సిట్టింగ్స్ కార్డ్స్ తో పాటు సీసీ కెమెరాలు ప్రతి సెంటర్లో ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు ప్రాథమిక చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు విద్యార్థులు ఎటువంటి భయాందోళనకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని కోరారు.

# సింగూర్ ప్రాజెక్టు ద్వారా మరో లక్ష ఎకరాలకు సాగునీరు

* **లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుకు ప్రణాళికలు..**
* **రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ..**

అందోలు, ప్రజాస్పూర్తి : లిఫ్ట్ ఇరిగేషన్ కింద సింగూరు ప్రాజెక్టు నుండి నియోజకవర్గానికి మరో లక్ష ఎకరాల ఆయకట్టకు సాగునీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందించిన్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శనివారం అందోలు జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ ఆర్ డి డిస్టలరీ కంపెనీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి



మాట్లాడుతూ.. ఆందోల్ నియోజక వర్గాన్ని ఎడ్యుకేషనల్, హెల్త్ హబ్ గా తీర్చిదిద్దామన్నారు. సింగూర్ ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలో 40 వేల ఎకరాల ఆయకట్టకు సాగునీరు అందిస్తున్నామన్నారు. అలాగే, నిరుద్యోగులకు, మహిళలకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఆర్ ఆర్ డి డిస్టలరీ ని ఏర్పాటుచేసిన యాజమాన్యాన్ని అభినందించారు. పరిశ్రమలోని అన్ని విభాగాలను పరిశీలించారు . పరిసర ప్రాంతాలలో ఉన్న వారికి ఈ పరిశ్రమలో ఉపాధి కల్పించడాన్ని మంత్రి స్వాగతించారు. ఈ పరిశ్రమ మరింత విస్తరించి రానున్న రోజుల్లో మరో 500 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు దోహద పడాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆకాంక్షించారు. నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే కంపెనీలకు ప్రోత్సాహం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్సీ భాను ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, డిస్టలరీ ఎండీ కొండల నిపుణ్ రెడ్డి, కంపెనీ డైరెక్టర్ త్రిష, మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రామ్ రెడ్డి, బండ అభిలాష్ రెడ్డి తీగల నర్సిరెడ్డి సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు,ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీ కి చెందిన పలువురుల కార్పొరేటర్లులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

# ఐక్యంగా ఉండి బృందావన్ కాలనీ అభివృద్ధి చేసుకుందాం

* **అందోల్-జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి..**
* **చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు సన్మానం..**



అందోలు, ప్రజాస్పూర్తి : జోగిపేట మున్సిపల్ పరిధిలోని బృందావన్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి అన్నారు. శనివారం కాలనీ పార్కులో ఏర్పాటుచేసిన సభలో మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు, వార్డు కౌన్సిలర్లు మర్రి అరుణ కుమారి ప్రదీప్ , అల్లే మంజుల శ్రీకాంత్, కోరబోయిన సరస్వతి లకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోనే బృందావన్ కాలనీ కి మంచి పేరు ఉందని, కాలనీవాసులందరూ ఐక్యంగా ఉండి ముందుకు పోవడం అభినందనీయమన్నారు.కాలనీలోరాష్ట్రవైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కృషితో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన తెలిపారు. సీసీ రోడ్లు, విద్యుత్ దీపాలు, మిషన్ భగీరథ కనెక్షన్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. పార్కు అభివృద్ధికి కూడా ప్రభుత్వం పరంగా నిధులు మంజూరు చేసి అభివృద్ధి పరుస్తామన్నారు. ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. మెయిన్ రోడ్డు పైన స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారిని కాలనీవాసులు శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కాలనీ అధ్యక్షులు అల్లే శ్రీకాంత్, కార్యదర్శి బస్వ సత్య ప్రకాష్, మాజీ కౌన్సిలర్ కోరబోయిన నాగరాజు, కోశాధికారి రవీందర్, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# బీరప్ప ఉత్సవాలకు ఆలయం ముస్తాబు..

* **ప్రారంభమైన జాతర ఉత్సవాలు**

అందోలు, ప్రజాస్పూర్తి : కురుమల కులదైవమైన బీరప్ప జాతర మహోత్సవాలను అత్యతం వైభవంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తియ్యాయి. ఈ సందర్భంగా బీరప్ప ఆలయాన్ని రంగురంగులతో అందంగా తీర్చి దిద్దారు. ఆలయం గోడలపై గొల్లబీర్ల వారి చిత్రాలను చిత్రీకరించారు. బీరప్ప దేవుడిని అత్యంత భక్తి శ్రద్ధలతో కొలుస్తూ గొర్రెల కాపర్ల కురుమ కులస్తులు గ్రామంలో పంటలు పండాలని , పశు సంపద వర్ధిల్లాలని కోరుతూ ఘనంగా జరుపుకునేందుకు నిర్వహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. బీరప్ప మహోత్సవాలలో భాగంగా ఇప్పటికే పసుపు కొట్నం, సున్నం వేయుట, కడుపలు కడుగుట, దేవుని మైలలు తీయుట వంటి కార్యక్రమాలను ఇప్పటికే పూర్తిచేశారు. శనివారం కార్యక్రమంలో భాగంగా డోలు వాయిద్యాల చప్పుల్ల మద్య గొల్లబీర్ల విన్యాసాల మద్య



గంగకు పోవుట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 22న ఆదివారం లగ్న బోనాలు ఊరేగింపు, 23న ఉదయం 11.55 గంటలకు శ్రీశ్రీశ్రీ బీరప్ప - కామరాతి కళ్యాణం, 24న మంగళవారం గారడి విద్య, రాత్రి నాగవెల్లి బోనాలు వెల్లుట, కథ, 25న బుధవారం నాగవెల్లి కథలు, సల్లలు చేయుట మందమీద చల్లలు పోయుట, 26న గురువారం బైయన్న పంగుగ, రాత్రి ఊరిలో కథ,27న శుక్రవారం కడుపలు కడుగుట, బీర్లవాల్లను సాగనంపుట వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

* **23న బీరప్ప – కామరాతి కళ్యాణం**

బీరప్ప మహోత్సవాలలో ప్రధాన ఘట్టమైన బీరప్ప - కామరాతి కళ్యాణాన్ని గల్లబీర్ల చేతుల మీదుగా ఘనంగా జరిపించేందుకు బీరప్ప ఆలయం వద్ద కళ్యాణ పందిరిని ఏర్పాటుచేయడంతో పాటు ఆలయంపై విద్యూత్ బల్బుల ద్వారా ఆలయం మెరిగొలిపేలా లైట్లు ఏర్పాటుచేశారు. బీరప్ప జాతర ఉత్సవాల సందర్భంగా కురుమల బంధుమిత్రులతో పాటు గ్రామ ప్రజల బంధువులు గ్రామానికి చేరుకోవడంతో గ్రామంలో పెద్ద పండగ వాతావరణం నెలకొంది. ఉత్సవాలలో పెద్ద ఎత్తున పాల్గొనన్నుండడంతో భక్తులకు ఎటవంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. కళ్యాణం రోజున అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటుచేశారు.

# పిస్తా హౌస్ ను ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి



నల్లగొండ, ప్రజాస్పూర్తి : సూపర్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి కానున్న నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో పిస్తా హౌస్ ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.శనివారం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లోని హైదరాబాదు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన పిస్తా హౌస్ ను మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి తో కలిసి మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ను వ్యాపార, వాణిజ్యపరంగా అభివృద్ధి చేసేందుకు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పనులతో పాటు కోట్లాది రూపాయలతో మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని వెల్లడించారు. నల్లగొండను సూపర్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని మంత్రి స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఇటికల మంగమ్మ శ్రీనివాస్ తోపాటు పలువురు కార్పొరేటర్లు, పిస్తా హౌస్ నిర్వాహకులు కొణతం నాగిరెడ్డి, వినయ్ రెడ్డి, మిధున్ రెడ్డి, నవ కిషోర్ రెడ్డి, కొణతం సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు బడి ఈడు పిల్లలను తప్పకుండా బడికి పంపించాలి




ప్రజాస్పూర్తి, జన్నారం : తల్లిదండ్రులు బడీ ఈడు పిల్లల్ని తప్పకుండా బడికి పంపించాలని కిష్టాపూర్ సర్పంచ్ వాసాల నరేష్ లోతొర్రె సర్పంచ్ బోడ శంకర్ లు అన్నారు.శనివారం మండలంలోని కిష్టాపూర్, లోతొర్రే గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కిష్టాపూర్ ప్రాథమిక పాఠశాల కు చెందిన విద్యార్థి తండ్రి నస్పూరి సత్యవతి తిరుపతి దంపతులు పాఠశాల విద్యార్థుల మధ్యాహ్న భోజనం కొరకై రూపాయలు ఐదు వేల విలువగల భోజనం ప్లేట్లను సర్పంచ్ వాసాల నరేష్ చేతుల మీద విరాళంగా అందజేశారు. అనంతరం నూతన సర్పంచ్ వాసాల నరేష్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్లు పోతుగంటి సప్న, యమునా జ్యోతిరామ్, ప్రధానోపాధ్యాయులు లావుడ్య సుధాకర్ నాయక్,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జ్యోతిర్లింగ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



జిన్నారం, ప్రజాస్పూర్తి : జిన్నారం మున్సిపల్ కేంద్రంలో నూతనంగా జ్యోతిర్లింగ విగ్రహ ప్రతిష్టలో భాగంగా నాలుగవ రోజు హోమ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య ఉత్సవాలు జరుగు తున్నాయి. ఉదయం పలువురు దంపతులు హోమంలో పాల్గొని పూజలు చేశారు. ఈ నెల 22 వరకు విగ్రహ ప్రతిష్ట కార్యమాలు నిర్వహించనున్నట్టు, భక్తులు భారీగా పాల్గొని కార్య మాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు బుక్క శ్రీకాంత్, బండి, కౌన్సిలర్ ప్రతాప్ రెడ్డి, మహేందర్,ఆనంద్ చారి, గాండ్ల శ్రీనివాస్, తదితరులు కోరారు.

# శివాలయ నిర్మాణానికి లక్షా 11వేలు విరాళంగా అందజేసిన కౌన్సిలర్ నరేందర్ రెడ్డి



జిన్నారం(గుమ్మడిదల), ప్రజాస్పూర్తి : జిన్నారం గ్రామ మున్సిపాలిటీ పరిధిలోనీ నిర్మాణంలో ఉన్న జీవన జ్యోతిర్లింగ శివాలయానికి గుమ్మడిదల మున్సిపాలిటీ 13వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ మూడు చింతల నరేందర్ రెడ్డి రూ.1,11,117/ విరాళంగా అందజేశారు. శివభక్తితో, ఆధ్యాత్మిక చైతన్యంతో, లోకకల్యాణం సంకల్పంతో ఆలయ నిర్మాణానికి తన వంతు సేవను అంకితమిచ్చిన కౌన్సిలర్ నరేందర్ రెడ్డిని శివాలయ నిర్మాణ కమిటీ సభ్యులు, అర్చక స్వాములు, గ్రామ పెద్దలు భక్తిపూర్వకంగా ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివసేవే జీవసేవే భావనతో ప్రజాసేవను కొనసాగిస్తున్న నాయకులు సమాజానికి నిజమైన ఆదర్శమన్నారు. కార్యక్రమంలో శివాలయ నిర్మాణ కమిటీ సభ్యులు, అర్చక స్వాములు, గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 75 కోట్ల స్మార్ట్ కార్డ్ ప్రతిపాదనను విరమించుకోవాలి

* **దివ్యాంగుల సంక్షేమ సంఘం డిమాండ్**

జీడిమెట్ల, ప్రజాస్పూర్తి : మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం కోసం ప్రభుత్వం ప్రతిపాదించిన రూ. 75 కోట్ల స్మార్ట్ కార్డ్ తయారీ నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు శనివారం లూయిస్ బ్రెయిలీ భవనంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో పలువురు సంఘం నాయకులు తమ గళాన్ని వినిపించారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం సమంజసమే కానీ, కేవలం కార్డుల తయారీ కోసమే 75 కోట్లు ఖర్చు చేయడం వృధా ప్రయాస అని వారు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం దివ్యాంగులకు, సీనియర్ సిటిజన్లకు, ఆర్టీసీ సిబ్బందికి ఎలాంటి సాధారణ కార్డులు జారీ చేస్తున్నారో, మహిళలకు కూడా అవే కార్డులను జారీ చేయాలని సూచించారు కార్డుల కోసం ఖర్చు చేసే ఆ 75 కోట్లను ఆర్టీసీలో కొత్త బస్సుల కొనుగోలుకు ఉపయోగిస్తే, ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడతాయని, ప్రజలకు మరింత వెసులుబాటు కలుగుతుందని సూచించారు. "ప్రభుత్వం ఈ సూచనను దివ్యాంగుల సంక్షేమ సంఘం తరపున సానుకూల సలహాగా స్వీకరించి, అనవసర ఖర్చును తగ్గించి ప్రజా ప్రయోజనాలకు ఖర్చు చేయాలన్నారు. ఈ సమావేశంలో వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి. అంజయ్య గౌడ్ , ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జి. యాదయ్య యాదవ్, ప్రతినిధులు ఏ. శేఖర్ గౌడ్, యు. అంజయ్య, సత్యం, బి. మట్టయ్య, సుధాకర్, సాయి గౌడ్, ఎస్ఎస్ఆర్ ఆంజనేయులు, తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు



# అనంతగిరిలో కాంగ్రెస్ వ్యూహరచన

* **డీసీసీ అధ్యక్షులకు రేవంత్, షర్మిల**
* **మార్గదర్శనం**




(ప్రజాస్ఫూర్తి, వికారాబాద్ జిల్లా) : రెండు రాష్ట్రాల కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యంగా అనంతగిరిలో పది రోజుల శిక్షణ శిబిరం అట్టహాసంగా ప్రారంభమైంది. సంఘటన సృజన్ అభియాన్ పేరుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ పలువురు మంత్రులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ జిల్లా అధ్యక్షులు పార్టీకి వెన్నెముక వంటివారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారే కీలకమని స్పష్టం చేశారు. పది రోజుల పాటు సాగే ఈ శిబిరంలో నాయకత్వ నైపుణ్యాలు, ఎన్నికల వ్యూహాలు, సోషల్ మీడియా నిర్వహణపై ఏపీ, తెలంగాణ డీసీసీ అధ్యక్షులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేసేందుకు ఈ శిబిరం ఒక మైలురాయిగా నిలుస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# సామ్రాజ్యవాదానికి కొమ్ముకాస్తున్న బీజేపీ విధానాలను తిప్పికొట్టాలి

* **సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సామ్రాజ్యవాదానికి కొమ్ముకాస్తున్న బీజేపీ విధానాలను తిప్పికొట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు.స్థానిక మంచికంటి భవనంలో శనివారం నిర్వహించిన 'రెడ్ బుక్ డే' కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు పాల్గొని మాట్లాడుతూ, కార్ల్ మార్క్స్ రచించిన కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక ప్రపంచ శ్రామికులకు దిశానిర్దేశం చేసిన చారిత్రాత్మక గ్రంథమని పేర్కొన్నారు. సోషలిజంకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతోందని, శ్రీలంకలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడటం ఇందుకు నిదర్శనమన్నారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మీసేవ మొబైల్ యాప్‌పై జిల్లా స్థాయి శిక్షణ




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:జిల్లాలో మీసేవ సేవలను వేగవంతంగా, పారదర్శకంగా అమలు చేయాలనే లక్ష్యంతో ఐడీఓసీ కార్యాలయంలో మీసేవ సర్టిఫికెట్ వెరిఫికేషన్ మొబైల్ యాప్‌పై శిక్షణ నిర్వహించారు. జితేష్ వి. పాటిల్ ఆదేశాల మేరకు జిల్లా ఈడిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.యాప్ ద్వారా క్షేత్రస్థాయిలోనే ధృవీకరణ పూర్తి చేసి జియోట్యాగ్ ఫోటోలతో నేరుగా పోర్టల్‌లో అప్‌డేట్ చేయవచ్చని, దీంతో నకిలీ దరఖాస్తులకు అడ్డుకట్ట పడుతుందని తెలిపారు. ముఖ్యంగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల దరఖాస్తులు త్వరితగతిన పరిష్కారమవుతాయని పేర్కొన్నారు.శిక్షణలో సుమారు 160 మంది జీపీవోలు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, 40 మంది నయాబ్ తహసీల్దార్లు పాల్గొన్నారు. యాప్ వినియోగంపై ప్రదర్శనతో అవగాహన కల్పించారు.

# గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

: **కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గ్రామాల సమగ్ర అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. శనివారం డాక్టర్ మన్మోహన్ సింగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పాత క్యాంపస్‌లో నిర్వహించిన రెండో విడత నూతన సర్పంచుల శిక్షణ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. అశ్వరావుపేట, దమ్మపేట, దుమ్ముగూడెం, ములకలపల్లి, జూలూరుపాడు, టేకులపల్లి, ఇల్లందు, లక్ష్మీదేవిపల్లి మండలాలకు చెందిన 233 మంది సర్పంచులకు 17 నుంచి 21 వరకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంపై అవగాహనతో గ్రామాభివృద్ధి ప్రణాళికలు, బడ్జెట్ నిర్వహణ, పారదర్శకత, ప్రజల భాగస్వామ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రాథమిక సదుపాయాలు, తాగునీరు, రహదారులు, విద్యుత్, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. శిక్షణ పూర్తిచేసుకున్న సర్పంచులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీపీఓ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# యధావిధిగా ప్రజావాణి కార్యక్రమం

రంగారెడ్డి జిల్లా, ప్రజాస్ఫూర్తి : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 23వ తేదీ (సోమవారం) నుండి యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడం వల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమం తిరిగి యధావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

# కొందుర్గు మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన




ప్రజాస్ఫూర్తి ప్రతినిధి, షాద్ నగర్ : రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం :కొందుర్గు మండల్ వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కొందుర్గు మండల కేంద్రంలో, పలు గ్రామాల్లో హై లెవెల్ బ్రిడ్జిలు, అందుబాటులో ఉన్న హెచ్ఎండిఏ నిధులతో శంకుస్థాపన చేశామన్నారు. ఏది ఏమైనా కొందుర్గు మండలం అభివృద్ధి కావాలనే ఆకాంక్షతో అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలు,నాయకులు పార్టీలకు అతీతంగా పూర్తి సహకారం ఉంది కాబట్టి రాబోవు మూడు సంవత్సరాలలో మండలం యొక్క రూపు రేఖలు మారబోతున్నాయన్నారు. ముందు ముందు కూడ అందరి సహకారం తీసుకొని ముందుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రభాకర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నరేందర్, వార్డ్ మెంబర్ దుర్గని శివ మాట్లాడుతూ కొందుర్గు మండల కేంద్రంలో 15 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారికి కొందుర్గు ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొందుర్గు మండలాల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేసుకోవడం జరిగిందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కొందుర్గు మండలంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కి శంకుస్థాపన చేయడం జరిగింది అని అన్నారు. రాబోవు రోజుల్లో కూడా కొందుర్గు మండలాన్ని అభివృద్ధి పథంలో తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రెడీగా ఉన్నారని అన్నారు. పార్టీలకతీతంగా అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, పురుషోత్తం రెడ్డి జితేందర్ రెడ్డి, రాములు గౌడ్,కెకె కృష్ణ,పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ , మల్లేష్‌గౌడ్, గోవర్ధన్ రెడ్డి, అంజిరెడ్డి, గోపాల్ రెడ్డి, విక్రమ్ రెడ్డి , సర్పంచ్ చౌడపురం ప్రభాకర్, మాజీ సర్పంచ్ యాదయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నరేందర్ డిప్యూటీ సర్పంచ్ చిప్ప చంద్రశేఖర్, వార్డ్ మెంబర్లు కటిక వెంకటేష్ తంగేళ్లపల్లి నవీన్, శీలం లింగం కావాలి ప్రవీణ్ కొమరబండ సునీత జంగయ్య, మద్ది శ్రీకాంత్, ఫర్హాత్ సుల్తానా శర్ఫుదిన్, బి శ్రీను వాసవి సోమల అనూష సంజీవ దుర్గని శివ బొజ గారి సువర్ణ, యారం శ్వేత జోసెఫ్ రెడ్డి సదుల లక్ష్మీ ముత్యాలు గ్రామ పెద్దలు,గ్రామ ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన రైతులను మోసం చేయాలని చూస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి

* **సిపిఐ రాష్ట్ర నాయకులు**




చేవెళ్ల, ప్రజాస్ఫూర్తి : గిరిజన రైతులను మోసం చేయాలని చూస్తున్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకొని,గిరిజన రైతులకు న్యాయం చేయాలని సిపిఐ రాష్ట్ర నాయకులు అన్నారు. ఒరిజినల్ పట్టాదారులను ప్రభుత్వం వదిలేసి ఎలాంటి సంబంధం లేని వారిని చేర్చి వేరే ఇద్దరినీ చేర్చి అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఒరిజినల్ పట్టా పాస్ పుస్తకం పొందిన గిరిజన రైతులకు న్యాయం చేయాలని, సిపిఐ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ చంద్రారెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ శంకర్ పల్లి మండల పరిధిలోని మోకిలా గ్రామ శివారులోని పొన్నగుట్ట తాండ గిరిజన రైతులు తమకు ప్రభుత్వం నుండి వచ్చిన అసైన్డ్ భూముల ను ఈ మధ్యకాలంలో ప్రభుత్వం తీసుకొని ఎకరాకు 800 గజాల చొప్పున రైతులకు ఇస్తుందన్నారు. గిరిజన రైతులను మోసం చేయాలని చూస్తున్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకొని,గిరిజన రైతులకు న్యాయం చేయకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు,చేవెళ్ల నియోజకవర్గం ఇన్చార్జి రాష్ట్ర సమితి సభ్యులు కే రామస్వామి, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు ఎం ప్రభు లింగం , శంకర్ పల్లి మండల కార్యదర్శి పి సుధీర్, నాయకులు రాజేందర్ గౌడ్, బద్దం శివారెడ్డి, రవి శంకర్ తదితరులు ఉన్నారు.

# నేడు జాతీయ కవలల దినోత్సవం





ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:అచ్చం ఒకేలా కనిపించే ముఖాలు.. ఒకేలా ఆలోచనలు... ఒకరు నవ్వితే మరొకరు నవ్వే ఆత్మీయ బంధం... అదే కవలల ప్రత్యేకత. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 22న జాతీయ కవలల దినోత్సవాన్ని నిర్వహిస్తూ కవలల విశిష్టతను గుర్తు చేసుకుంటున్నారు.సమాన (ఒకే రూపం) మరియు అసమాన కవలలుగా విభజించబడే వీరి జననాలు ఆధునిక వైద్య సాంకేతికతల అభివృద్ధితో ఇటీవల పెరుగుతున్నాయి. చిన్ననాటి నుంచే ఒకేలా దుస్తులు ధరించడం, ఒకే తరగతిలో చదవడం, ఒకే అభిరుచులు కలిగి ఉండడం కవలల మధ్య ఉన్న ప్రత్యేక అనుబంధాన్ని మరింత బలపరుస్తాయి.కవలల మధ్య ఉన్న ఆత్మీయత, పరస్పర అవగాహన సమాజానికి ఐక్యత, ప్రేమకు ప్రతీకగా నిలుస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో కవలలపై రూపొందించిన ఫోటో స్టోరీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# మున్సిపల్ నూతన చైర్మన్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు ఘన సన్మానం

ప్రజా స్ఫూర్తి, షాద్ నగర్ : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని 23వ వార్డు ఇబ్రహీం కాంప్లెక్స్ వెనకాల ఉన్న మైసమ్మ దేవాలయం వద్ద షాద్నగర్ మున్సిపాలిటీ నూతన చైర్మన్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్, కౌన్సిలర్లు అగ్గనూరి విశాలవిశ్వం, మురళీమోహన్, పెంటయ్య, దిలీప్ ను సాయి మిత్ర యూత్ అసోసియేషన్(మెయిన్ రోడ్డు) ఆధ్వర్యంలో అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఘనంగా సన్మానించారు. అంతకుముందు దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి అనుగ్రహం పట్టణ ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం నూతన చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లను శాలువలతో సన్మానించడంతోపాటు దేవాలయానికి వచ్చిన భక్తులకు మిఠాయిని పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, యూత్ సభ్యులు ఏ. అభిలాష్, అగ్గనూరి రాజు, అగ్గనూరి నందు, ఆర్. కైలాస్ నాథ్, ప్రసాద్, భూషం నరేశ్, కాపర్తి లక్ష్మణ్, కాపర్తి ప్రవీణ్, భక్తులు పాల్గొన్నారు.




# ఎస్ జీ ఎఫ్ ఆధ్వర్యంలో పుస్తకాల వితరణ




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్(ఎస్ జి ఎఫ్ ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఉమెన్స్ గిల్డ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కొత్తగూడెం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తకాలను అందజేశారు. వివిధ పోటీ పరీక్షలకు ఉపయోగపడే , ఇతర విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలను అందజేయడం జరిగింది. ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోగాని శ్రీనివాస్, సభ్యుడు చిరపంగి శ్రీనివాసరావు చేతుల మీదుగా ఈ పుస్తకాలను జిల్లా కేంద్ర గ్రంథాలయం లో లైబ్రేరియన్ జి.మణి మృదుల కు అందజేశారు ఈ సందర్భంగా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, గ్రంథపాలకురాలు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రింట్ మీడియా పాత్ర సమాజ నిర్మాణంలో ఎంతో కీలకం

* **మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్**



బోడుప్పల్, ప్రజాస్ఫూర్తి : మేడిపల్లి మండలం ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర 2026 డైరీని మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ కు ప్రెస్ క్లబ్ సభ్యులు అందజేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రింట్ మీడియా పాత్ర సమాజ నిర్మాణంలో ఎంతో కీలకమని, ఇలాంటి కార్యక్రమాలు సభ్యుల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యువజన నాయకుడు జన్నె రాజు, క్లబ్ అధ్యక్షులు చిర్ర శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వడ్డెమాన్ సుందర్, కోశాధికారి మరాటి మల్లేష్, సీనియర్ సభ్యులు ననుబోతు రాము యాదవ్, సంయుక్త కార్యదర్శి చిన్నం మధు, బైరెడ్డి సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం చేస్తున్నటువంటి మంచి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి

* **మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు**



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వం చేస్తున్నటువంటి మంచి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు అన్నారు. శనివారం గౌతమ్ నగర్ 182 డివిజన్లో మైనంపల్లి హనుమంత రావు పర్యటించారు. అనంతరం దయానంద్ నగర్ లో నివాసం ఉంటున్న కాంగ్రెస్ పార్టీ లీడర్ అనిల్ కుమార్ గత కొద్దిరోజుల నుండి ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండడంతో విషయం తెలుసుకుని పరామర్శించారు. అతని హాస్పిటల్ ఖర్చు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీలకు ద్విచక్ర వాహనాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు , కార్యకర్తలు కాలనీవాసులు పాల్గొన్నారు.

# షాపుల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి

: **సీఐ డి. ప్రతాప్**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రామవరం ప్రాంతంలోని షాపుల యజమానులు తమ దుకాణాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని టూ టౌన్ సీఐ డి. ప్రతాప్ సూచించారు.సీసీ కెమెరాల ద్వారా నేరాల నియంత్రణకు తోడ్పాటు లభిస్తుందని, ఘటనల సమయంలో నిందితులను త్వరగా గుర్తించేందుకు ఆధారాలు అందుతాయని తెలిపారు. బిజీ ఏరియాలు, మార్కెట్ ప్రాంతాలు, బంగారు దుకాణాలు, మెడికల్ షాపులు, ఫైనాన్స్ కార్యాలయాల వద్ద నాణ్యమైన కెమెరాలు అమర్చాలని సూచించారు.24 గంటలు పనిచేసే విధంగా, కనీసం 30 రోజుల ఫుటేజ్ స్టోరేజ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని, రాత్రి స్పష్టమైన దృశ్యాల కోసం నైట్ విజన్ కెమెరాలు ఉపయోగించాలని చెప్పారు. పట్టణ భద్రత కోసం పోలీసులకు వ్యాపారులు సహకరించాలని కోరారు.

# విజయ గణపతి ఆశీస్సులతో చేపట్టిన ప్రతి పనిలో విజయం చేకూరాలి : ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : విజయ గణపతి ఆశీస్సులతో చేపట్టిన ప్రతి పనిలో విజయం చేకూరాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు లు అన్నారు. శనివారం జిహెచ్ఎంసి దుండిగల్ సర్కిల్ పరిధి మల్లంపేటలోని బావనాస్ జివిల్స్ క్లిఫ్స్ గేటెడ్ కమ్యూనిటీలో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ విజయ గణపతి దేవాలయం ప్రాణ ప్రతిష్ఠ , ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ నాగరాజ్ యాదవ్, తాజా మాజీ కౌన్సిలర్లు మాదాస్ వెంకటేష్, హనుమంతరావు, వార్డు ప్రెసిడెంట్ రమేష్‌ముదిరాజ్, నాయకులు కుమార్ యాదవ్, మాదాస్ నవీన్, మాదాస్ నర్సింగ్ రావు, అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

5 లక్షల ఇళ్లు
# మంజూరు చేయండి

* **కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు రాష్ట్ర మంత్రి పొంగులేటి విజ్ఞప్తి**



హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(202526)లో రాష్ట్రానికి కనీసం 3 లక్షలు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 2 లక్షలు కలిపి మొత్తం 5 లక్షల ఇళ్లను మంజూరు చేయాలని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. శనివారం హైదరాబాద్‌కు వచ్చిన ఆయనతో పొంగులేటి సమావేశమయ్యారు. అనంతరం రాష్ట్రానికి కేటాయించాల్సిన ఇళ్లపై వినతిపత్రం సమర్పించారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం రాబోయే మూడేళ్లలో అర్హులైన ప్రతిఒక్కరికి ఇంటిని నిర్మించి ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే 4 లక్షల ఇళ్లను మంజూరు చేశాం. కేంద్రం సహకారం అందిస్తే ఈ కార్యక్రమం మరింత వేగవంతం అవుతుంది. గత 12 ఏళ్లలో రాష్ట్రానికి రావాల్సిన ఇళ్లను దృష్టిలో పెట్టుకుని మొత్తం 5 లక్షల ఇళ్లను మంజూరు చేయాలి' అని కేంద్రమంత్రికి పొంగులేటి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలి

* **: బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**
* **సంస్కృతి పాఠశాలలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన**
* **300 మందికి వైద్య పరీక్షలు**
* **ఉచితంగా మందుల పంపిణీ**













(ప్రజాస్ఫూర్తి, జగద్గిరిగుట్ట) : జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్ గృహకల్ప లోని సంస్కృతి స్కూల్ లో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు. శనివారం పాఠశాల ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ ఆధ్వర్యంలో మల్లారెడ్డి హాస్పిటల్ సౌజన్యంతో ఉచితం గా వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథి గా హాజరైన వివేకానంద మాట్లాడుతూ నిరుపేదలు అత్యధికంగా నివసించే జగద్గిరిగుట్ట ప్రాంతంలో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు చాలా అవసమన్నారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసిన సంస్కృతి స్కూల్ యాజమాన్యానికి, మల్లారెడ్డి హాస్పిటల్ డాక్టర్ల బృందానికి, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరం లో సుమారు 300మందికి సాధారణ, కంటి, దంత, గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అదేవిదంగా సుమారు 350 మంది విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగన్, స్కూల్ కరస్పాండెంట్ గడ్డమీది బాల రాజు, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షులు బి.ఆంజనేయులు, చల్లా శ్రీనివాస్ రెడ్డి, వినోద్ జాదవ్, సిహెచ్.నరసింహులు, ఎస్. ఆర్. భాషా, మల్లారెడ్డి హాస్పిటల్ డాక్టర్ల బృందం తదితరులు పాల్గొన్నారు.

ఏఐ సమ్మిట్ వద్ద యూత్ కాంగ్రెస్ నిరసనలపై
# కేటీఆర్ స్పందన


* **అంతర్జాతీయ సదస్సులను రాజకీయ ప్రదర్శనలకు ఉపయోగించడంపై కేటీఆర్ మండిపాటు**
* **ఇది దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్య అని వ్యాఖ్య**
* **ఇలాంటి వేదికల్లో హుందాగా వ్యవహరించాలని సూచన**



ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 వేదిక వద్ద యూత్ కాంగ్రెస్ నాయకులు చేసిన నిరసనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి అంతర్జాతీయ సదస్సులను రాజకీయ ప్రదర్శనలకు ఉపయోగించడం దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్య అని అభివర్ణించారు. అంతర్జాతీయ సదస్సులు దేశ ప్రతిభను, సామర్థ్యాన్ని ప్రపంచానికి చూపించే వేదికలని అన్నారు. ఇలాంటి వేదికల్లో హుందాగా వ్యవహరించాలని చెప్పారు. రాజకీయ విభేదాలు సహజమే అయినా... అభిప్రాయ భేదాలను వ్యక్తపరచడానికి సరైన సమయం, సరైన వేదిక ఉండాలని కేటీఆర్ అన్నారు. గ్లోబల్ ఈవెంట్‌లలో ఇలాంటి నిరసనలు చేపట్టడం వల్ల భారత్‌పై అంతర్జాతీయంగా ప్రతికూల అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందని విమర్శించారు. ఈ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలోనే యూత్ కాంగ్రెస్ నాయకులు నిరసన చేయడం చాలా విచిత్రంగా ఉందని వ్యాఖ్యానించారు.

కొండాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్..
# రూ.1,400 కోట్ల విలువైన భూమికి రక్షణ

* **కొండాపూర్‌లో 7 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా**
* **కబ్జాకు గురైన పార్కులు, ప్రజావసరాల స్థలాలను స్వాధీనం చేసుకున్న హైడ్రా**
* **ఆక్రమణలు తొలగించి, స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన అధికారులు**
* **కాలనీ సంక్షేమ సంఘం ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం**
* **దశాబ్దాల సమస్య పరిష్కారమవడంతో స్థానికుల ఆనందం**




హైదరాబాద్ నగర శివారులోని అత్యంత ఖరీదైన ప్రాంతమైన కొండాపూర్‌లో కబ్జాకు గురైన సుమారు 7 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. దీని విలువ బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.1,400 కోట్లు ఉంటుందని అంచనా. అధికారులు ఆక్రమణలను తొలగించి, శనివారం ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ బోర్డులను సైతం ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళితే, రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లోని సర్వే నంబర్ 78 నుంచి 93 పరిధిలో రాజరాజేశ్వరి నగర్ కాలనీ పేరుతో 1993లో గ్రామపంచాయతీ లేఅవుట్ వేశారు. ఈ లేఅవుట్‌లో ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 5 ఎకరాలు, పాఠశాలకు ఒక ఎకరా, పార్కులకు ఎకరాకు పైగా, కమ్యూనిటీ హాల్ కోసం 2181 గజాల స్థలాన్ని కేటాయించారు. అయితే, కాలక్రమేణా ఈ విలువైన స్థలాలు కబ్జాకు గురయ్యాయి. పాఠశాల స్థలంలో అపార్ట్‌మెంట్, కమ్యూనిటీ హాల్ స్థలంలో ప్రైవేటు దుకాణాలు, షెడ్లు వెలిశాయి. ఈ ఆక్రమణల వెనుక బడాబాబులు ఉన్నారని, ప్రజావసరాల కోసం కేటాయించిన భూములను కాపాడాలని రాజరాజేశ్వరి నగర్ కాలనీ సంక్షేమ సంఘం హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. లేఅవుట్‌లోని ప్లాట్లు ఎల్ఆర్ఎస్ అయినప్పుడు, పార్కులు, ప్రజావసరాల స్థలాలు ఎలా ఆక్రమణదారుల సొంతమవుతాయని వారు ప్రశ్నించారు. ఈ ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెంటనే స్పందించి, అధికారులను క్షేత్రస్థాయి పరిశీలనకు ఆదేశించారు. లేఅవుట్ ప్రకారం ఆ భూములు ప్రజావసరాలకు చెందినవేనని నిర్ధారించుకున్న అధికారులు, వెంటనే ఆక్రమణలను తొలగించి, భూమి చుట్టూ ఫెన్సింగ్ వేశారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని తమ సమస్యకు హైడ్రా పరిష్కారం చూపడంతో రాజరాజేశ్వరి నగర్‌లోని సుమారు 5 వేల కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. తమకు అండగా నిలిచిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపాయి.

చంచల్‌గూడ జైలు ములాఖత్‌లలో ఉగ్రకుట్ర..
# స్పందించిన పోలీసు అధికారి

* **ఉగ్రకుట్రల వార్తలన్నీ వదంతులే అన్న డీఐజీ**
* **జాతీయ భద్రతకు సంబంధించిన అంశాల్లో నిజానిజాలు తెలుసుకోవాలని సూచన**
* **ప్రముఖ ఛానళ్లలో ప్రచారం జరిగితే ప్రజలు భయాందోళనకు గురవుతారన్న డీఐజీ**



హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు ములాఖత్‌లలో ఉగ్రకుట్రకు ప్రణాళికలు రచించారనే ప్రచారంపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. ఉగ్రకుట్రల వార్తలన్నీ వదంతులేనని స్పష్టం చేశారు. ఈ మేరకు డీఐజీ శ్రీనివాస్ మాట్లాడుతూ, రెండు రోజులుగా సామాజిక మాధ్యమాలు, కొన్ని ఛానళ్లలో చంచల్‌గూడ జైలు నుంచి ఉగ్రకుట్ర అని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోందని, ఇందులో ఎలాంటి వాస్తవం లేదని తెలిపారు. జాతీయ భద్రతకు సంబంధించిన అంశాల్లో ఏదైనా విషయాన్ని ప్రసారం చేయడానికి ముందు నిజానిజాలు ధృవీకరించుకోవాలని సూచించారు. బాధ్యతాయుతమైన మీడియా ఛానళ్లు ఇలాంటి విషయాలలో అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ప్రముఖ ఛానళ్లలో ఇలాంటి వార్తలు వస్తే ప్రజలు భయాందోళనకు గురవుతారని అన్నారు. ప్రజల్లోని ఆందోళన తొలగించడానికే ఈరోజు మీడియా ముందుకు వచ్చామని అన్నారు. చంచల్‌గూడ జైల్లో లష్కరేకు చెందిన ఉగ్రవాది ఒక్కడే ఉన్నాడని తెలిపారు. అతనికి కూడా భార్యతో తప్ప ఎవరితోనూ ములాఖత్ లేదని స్పష్టం చేశారు.

పరీక్షలు ఉన్నాయని ఆందోళన వద్దు
# ఇంటర్ విద్యార్థులకు కవిత సూచన

* **ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయాలని సూచన**
* **పరీక్షలు బాగా రాయలేననే ఆందోళన వద్దన్న కవిత**
* **పరీక్షలు అనేవి పూర్తి జీవితంలో చిన్న అంశమని వ్యాఖ్య**



తెలంగాణలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఈ నెల 25వ తేదీ నుంచి జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విద్యార్థులకు సూచనలు చేశారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా, పూర్తి ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షల్లో ఆందోళనకు గురికాకుండా ఎంత వస్తే అంత రాయాలని సూచించారు. ఫలితాల కోసం ఏమాత్రం ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు. పరీక్షలు బాగా రాయలేనేమోననే ఆందోళనతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్లు వార్త చూశానని, కాబట్టి ఫలితాల గురించి భయపడవద్దని అన్నారు. పరీక్షలు అనేవి జీవితంలో చిన్న పందెమని గుర్తుంచుకోవాలని సూచించారు. ఒక పరీక్ష సరిగ్గా రాయకుంటే మన జీవితం అంతటితో ఆగిపోదని అన్నారు. పరీక్షల తర్వాత ఎంతో జీవితం ఉందని వ్యాఖ్యానించారు. పరీక్షల భయంతో ఏదైనా చేసుకుంటే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎంత క్షోభిస్తారో గుర్తుంచుకోవాలని అన్నారు. పరీక్షల వంటి చిన్న చిన్న అంశాలను దాటుకుంటూ వెళితే జీవితంలో పెద్ద పెద్ద వాటిని సులభంగా ఎదుర్కోవచ్చని అన్నారు.

అగ్రి షో వంటి కార్యక్రమాలు ప్రభుత్వం నిర్వహిస్తే
## మేలు జరుగుతుంది: హరీశ్ రావు

* **ఎన్టీఆర్ మైదానంలో ఏర్పాటు చేసిన అగ్రి షోను సందర్శించిన హరీశ్ రావు**
* **తెలంగాణలో యూరియా కొరతను నివారించాలని డిమాండ్**
* **రైతులకు ఆధునిక పరికరాలను సబ్సిడీపై ఇవ్వాలని డిమాండ్**



రైతుబడి అగ్రి షో వంటి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తే రైతులకు మేలు జరుగుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ మైదానంలో ఏర్పాటు చేసిన అగ్రి షోను ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ, తెలంగాణలో యూరియా కొరతను నివారించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఆధునిక పరికరాలను సబ్సిడీపై ఇవ్వాలని అన్నారు. సాగు పనిముట్లకు రాయితీపై రైతుల పక్షాన అసెంబ్లీలో చర్చిస్తామని హరీశ్ రావు వెల్లడించారు. అగ్రి వంటి కార్యక్రమాలు రైతులకు అన్ని రకాలుగా దోహదపడుతాయని అన్నారు. ఈ అగ్రి షో కార్యక్రమంలో రైతుబడికి చెందిన రాజేందర్ రెడ్డి మాజీ మంత్రి హరీశ్ రావుపై ప్రశంసలు కురిపించారు. హరీశ్ రావు మంత్రిగా ఉన్న సమయంలో స్వయంగా తనకు ఫోన్ చేసి సాగర్‌లో స్థానిక పరిపాలన లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, దీని మీద వార్తలు రాస్తే దాని ఆధారంగా చర్యలు తీసుకుంటానని తనకు చెప్పారని గుర్తుచేసుకున్నారు. అప్పుడు నాగార్జున సాగర్ ప్రాజెక్టు కింద పాలన ఉండేదని అన్నారు. ఆ సమయంలో తాను రెండు మూడు వార్తలు రాశానని, మిగతా మీడియా కూడా స్పందించి వార్తలు రాసిందని అన్నారు. వాటి ఆధారంగా హరీశ్ రావు నాగార్జున సాగర్‌ను మున్సిపాలిటీగా చేసి స్థానిక పాలన జరిగేలా చేశారని గుర్తు చేసుకున్నారు.

హైదరాబాద్ సిటీ పోలీస్ వినూత్న నిర్ణయం..
## విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం

హైదరాబాద్: హైదరాబాద్ సిటీ పోలీసులు వినూత్న నిర్ణయం తీసుకున్నారు. డేటా అనాలసిస్, రీసెర్చ్ ప్రాజెక్టులు, ఆధునిక పోలీసింగ్‌లో విద్యార్థులను భాగస్వాములను చేయాలన్న లక్ష్యంతో.. 25 ఏళ్లలోపు డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం నిర్వహించనున్నారు. ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన వారికి అధికారిక ధ్రువపత్రాలు ఇవ్వనున్నారు. ఎస్ఎమ్ఐటీ సెల్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు https://www.hyderabadpolice.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని సూచించారు.

## తెలంగాణలో ఫిబ్రవరి నెలాఖరు వరకు పత్తి కొనుగోళ్లు

హైదరాబాద్: తెలంగాణలో ఈ నెలాఖరు వరకు పత్తి కొనుగోళ్లు చేయనున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తితో సీసీఐ నిర్ణయం తీసుకుంది. జాయింట్ సెక్రెటరీ, కేంద్ర జౌళిశాఖకి రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి నిన్న లేఖ రాశారు. పత్తి కొనుగోళ్ల గడువును పొడిగించాలని ఇప్పటికే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని మంత్రి తుమ్మల కోరారు. కేంద్ర ప్రభుత్వం, సీసీఐ నిర్ణయంతో మంత్రి సంతోషం వ్యక్తం చేశారు.

FSL అగ్నిప్రమాద ఘటన..
# డేటా రికవరీ కష్టమే



హైదరాబాద్: నాంపల్లి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో ఇటీవల జరిగిన భారీ అగ్నిప్రమాదంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ అగ్నిప్రమాద ఘటనలో 1,100 ఫైల్స్ దగ్ధం అయినట్లు నాగ్‌పూర్ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం గుర్తించింది. దగ్ధమైన ఫైల్స్‌లోని డేటా రికవరీ కోసం ఆ బృందం తీవ్రంగా ప్రయత్నించింది. ఈ ఫైల్స్‌లోని డేటా రికవరీ చేయడం కష్టమని ప్రత్యేక బృందం తేల్చింది.

* **కేసుల దర్యాప్తులో ఎఫ్ఎస్ఎల్ ఎంతో కీలకం**

వివిధ కేసుల దర్యాప్తులో ఎఫ్ఎస్ఎల్ కీలక పాత్ర పోషిస్తుంది. రక్తం, వెంట్రుకలు, వేలిముద్రలు, ఆయుధాలు, బుల్లెట్లు, డాక్యుమెంట్లు ఫోర్జరీ జరిగాయా లేదా, డీఎన్ఏ నమూనాలు, ఎలక్ట్రానిక్ డివైజ్‌ల విశ్లేషణ సహా ఇతర అన్ని ఆధారాలను ల్యాబ్‌లో పరిశీలించి నివేదికలు తయారుచేస్తారు. కోర్టు తీర్పుల్లో ఈ ఆధారాలే కీలకంగా ఉంటాయి. ఈ ప్రమాద ప్రభావం కేసుల దర్యాప్తుపై ఎంతమేర పడనుందనేది ఆందోళనకరమైన విషయం.

# భారత్-బ్రెజిల్ ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యం 20 బిలియన్ డాలర్లు!

భారత్ పర్యటనలో ఉన్న బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. కీలక ఖనిజాలు, భద్రతా అంశాలపై దృష్టిపెట్టిన ఇరువురు నేతలు.. బహుముఖ సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. వచ్చే ఐదేళ్లలో ఇరు దేశాల మధ్య వాణిజ్యం 20 బిలియన్ డాలర్లకు మించి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. లాటిన్ అమెరికాలో భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా బ్రెజిల్ ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. లూలా స్ఫూర్తిదాయక నాయకత్వం, దార్శనికతతో ఇరు దేశాలు ప్రయోజనం పొందుతున్నాయని, ఇది విన్‌విన్ భాగస్వామ్యమని అభివర్ణించారు. ఈ రెండు దేశాలు కలిసి పనిచేస్తే.. వర్ధమానప్రపంచం మరింత బలపడుతుందన్నారు. ఉగ్రవాదం, దానికి మద్దతిచ్చేవారు మానవాళికి శత్రువులని ఈ రెండు దేశాలు అంగీకరిస్తున్నాయని చెప్పారు. గతేడాది జులైలో ప్రధాని మోదీ బ్రెజిల్‌లో పర్యటించడం ఇరుదేశ సంబంధాల్లో



ఓ మైలురాయి అని సిల్వా పేర్కొన్నారు. ఇప్పటికే ఐదు రంగాల్లో ద్వైపాక్షిక సహకార అజెండాను పునర్నిర్మించుకున్నామని, తాజాగా ఇరు దేశాల భాగస్వామ్యానికి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పలు ఒప్పందాలు చేసుకున్నామన్నారు. ఐటీ, ఏఐ, బయోటెక్నాలజీ, అంతరిక్ష ప్రయోగాలు వంటి అత్యాధునిక రంగాల్లో భారత్ ఎంతో పురోగతి సాధిస్తోందని, ఇవి బ్రెజిల్‌కు ఎన్నో అవకాశాలు కల్పిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## మహిళ తెగువ.. ఖడ్గాన్ని చేతపట్టి.. దుండగులను తరిమికొట్టి!

రాత్రివేళ దారి దోపిడీకి యత్నించిన దుండగుల ఆటకట్టించేందుకు ఓ మహిళ తెగువ ప్రదర్శించారు. ఖడ్గం తీసుకుని వారిపైకి దూసుకెళ్లారు. ఊహించని ఈ ప్రతిఘటనతో ఆ దొంగలు అక్కడినుంచి పారిపోయారు. పంజాబ్‌లోని లుధియానాలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హర్‌జింద్ కౌర్ అనే ఎన్‌ఆర్‌ఐ మహిళ ఇటీవలే ఆస్ట్రేలియా నుంచి పంజాబ్‌కు వచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి లుధియానాలోని బంధువుల ఇంటికి కారులో బయల్దేరారు. దారిమధ్యలో బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు వారి వాహనాన్ని వెంబడించారు. వారి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో కారులోని ఓ మహిళ వీడియో తీయడం మొదలుపెట్టారు. అంతలోనే బైక్‌పై ఉన్న వ్యక్తుల్లో ఒకరు కారు అద్దంపై గుడ్లు విసిరి.. ఆపేందుకు యత్నించాడు. ఈ ఘటనతో కారులో ఉన్నవారు భయాందోళనలకు గురయ్యారు.



అయితే, డ్రైవింగ్ చేస్తున్న హర్‌జింద్ కౌర్ మాత్రం ధైర్యసాహసాలు ప్రదర్శించారు. ఒక ఖడ్గం తీసుకుని బయటకు వచ్చారు. ఆయుధాన్ని చూపిస్తూ.. నడి రోడ్డుపై వారిని తరిమారు. దీంతో తోకముడిచిన దుండగులు అక్కడినుంచి పారిపోయారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు.

## పరువు నష్టం కేసులో కోర్టుకు హాజరైన రాహుల్ గాంధీ


మహారాష్ట్రలో నమోదైన ఓ పరువునష్టం కేసులో బెయిల్‌కు సంబంధించి కొత్త గ్యారంటీ దాఖలు చేయడానికి రాహుల్ గాంధీ శనివారం భివండీ మేజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరయ్యారు. ఆ కేసులో కాంగ్రెస్ మహారాష్ట్ర చీఫ్ హర్షవర్ధన్‌ను తన కొత్త హామీదారుగా పేర్కొన్నారు. ఈ కేసులో ఇప్పటి వరకు గ్యారంటర్‌గా ఉన్న కేంద్ర



మాజీ మంత్రి శివరాజ్ పాటిల్ గతేడాది డిసెంబర్ 12న మరణించారు. దీంతో ఆయన స్థానంలో కొత్త హామీదారు పేరును నమోదు చేయాల్సిందిగా న్యాయస్థానం రాహుల్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేత స్వయంగా కోర్టుకు హాజరయ్యారు. 2014 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మహారాష్ట్రలోని సోనాలే గ్రామంలో జరిగిన ర్యాలీలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. అక్కడ ఆయన మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ హత్య వెనుక ఆర్‌ఎస్‌ఎస్ హస్తం ఉందని ఆరోపించారు. ఆయన ప్రసంగం ఆర్‌ఎస్‌ఎస్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని పేర్కొంటూ.. అప్పట్లో సంఘ్ కార్యకర్త రాజేష్ కుంటే భివండీ మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు చేశారు. దీంతో ఈ కేసుపై విచారణ కొనసాగుతోంది.

## ఇక ఇజ్రాయెల్ బాణంతో భారత్ గురి..?

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 25-26 తేదీల్లో రెండ్రోజుల పాటు ఇజ్రాయెల్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వ్యూహాత్మక సంబంధాలు, రక్షణ రంగంలో సహకారాన్ని మరింత విస్తరించుకునే దిశగా అడుగులు పడనున్నాయి. యాంటీ బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్, లేజర్ వెపన్స్, లాంగ్‌రేంజ్ స్టాండాఫ్ మిస్సైల్స్, డ్రోన్ల అభివృద్ధిలో ఇరుదేశాలు పాలుపంచుకొనేలా రక్షణ ఒప్పందం జరగనున్నట్లు తెలుస్తోంది. ఈ పర్యటన అజెండాపై రెండు దేశాల నుంచి ప్రస్తుతానికి ఎలాంటి ప్రకటనా రాలేదు. అయితే అత్యాధునిక రక్షణ సాంకేతిక పరిజ్ఞానాన్ని భారత్‌తో పంచుకునేందుకు ఇజ్రాయెల్ (Israel) అంగీకరించినట్లు తెలుస్తోంది. హైటెక్ లేజర్ డిఫెన్స్, స్టాండాఫ్ సిస్టమ్స్ అందులో ఉన్నాయి. ఈ విస్తృత రక్షణ సహకారానికి గతేడాదే పునాది పడింది. గత నవంబర్‌లో డిఫెన్స్ సెక్రటరీ ఆర్కే సింగ్ ఇజ్రాయెల్‌లో పర్యటించారు. అప్పుడే దీని అవగాహన ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఇజ్రాయెల్‌తో



కలిసి యాంటీ బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ వ్యవస్థను అభివృద్ధి చేయాలని భారత్ భావిస్తోంది. ఇది మిషన్ సుదర్శన్‌కు కీలకం కానుంది. భారత్‌లోని కీలకమైన వ్యవస్థలు, అణువిద్యుత్ కేంద్రాలు, ఇస్రో సంస్థలను దీర్ఘశ్రేణి క్షిపణుల నుంచి రక్షించుకునేందుకు ప్రధాని మోదీ ఈ మిషన్‌ను ప్రకటించారు. లాంగ్‌రేంజ్ యారో, మీడియం రేంజ్ స్లింగ్, షార్ట్ రేంజ్ ఐరన్ డోమ్ సిస్టమ్‌తో కూడిన యాంటీ బాలిస్టిక్ మిస్సైల్ సిస్టమ్‌లో ఇజ్రాయెల్ లీడర్‌గా ఉంది. యారో మిస్సైల్ సిస్టమ్‌ను ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. ఎక్కువ ఎత్తు నుంచి వచ్చే క్షిపణులను ఇది అడ్డగిస్తుంది. ఇందులో యారో3.. 100 కిలోమీటర్ల ఎత్తు నుంచి, అంతరిక్షం నుంచి ప్రయోగించే క్షిపణులను కూడా అడ్డుకుంటుంది. యారో2.. ఇది భూవాతావరణం నుంచి ప్రయోగించే స్వల్ప, మధ్యశ్రేణి క్షిపణులను అడ్డుకుంటుంది. యారో4 అయితే అభివృద్ధి దశలో ఉంది. హైపర్‌సోనిక్ ముప్పులను ఎదుర్కొనే లక్ష్యంతో దీనిని రూపొందిస్తున్నారు. ఇక యారో3ని ఇజ్రాయెల్ ఇతర దేశాలకు విక్రయిస్తోంది. అలాగే దీర్ఘశ్రేణి క్షిపణులు, కామికేజ్ డ్రోన్లను కొనుగోలు చేయాలని చూస్తోంది. అవి శత్రుదేశాల రక్షణ వ్యవస్థలను దాటి దాడి చేయగలవు. ఈ డ్రోన్లు ఆధునిక యుద్ధతంత్రంలో కీలకపాత్ర పోషించనున్నాయి. ఇవి టార్గెట్‌పై పడి పేలిపోయే ఆత్మాహుతి డ్రోన్లు. తక్కువ ఖర్చుతో శత్రువుల ఆస్తులను ధ్వంసం చేస్తాయి.



## ఉగ్ర ముప్పు హెచ్చరికల వేళ.. కశ్మీర్‌లో ఐఈడీ గుర్తింపు

ఢిల్లీ సహా దేశ వ్యాప్తంగా పలు ముఖ్య నగరాల్లో ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గాలింపు చర్యలు చేపట్టిన భద్రతా బలగాలు జమ్మూ కశ్మీర్‌లో ఉగ్ర కుట్రను భగ్నం చేశాయి. గందేర్‌బాల్ జిల్లాలో ఓ బ్యాగులో మందుపాతరను గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. వెంటనే బాంబ్ నిర్వీర్యదళ సహాయంతో పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేశామన్నారు. మరిన్ని ప్రదేశాల్లో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ఏవైనా అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని స్థానికులను కోరారు. ఢిల్లీలోని ఎర్రకోట, చాందినీ చౌక్ ప్రాంతంలో దాడులు చేసేందుకు పాక్‌కు చెందిన ఉగ్ర సంస్థ లష్కరే తయ్యిబా ప్లాన్ చేసినట్లు నిఘావర్గాలు తాజాగా హెచ్చరించాయి. దేశంలోని ప్రముఖ నగరాల్లో దాడులు జరిగే అవకాశం ఉందని తెలిపాయి. నగరాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేశారు.

## ట్రంప్ దూకుడుకు బ్రేకులేయించిన భారత సంతతి లాయర్.. ఎవరీ నీల్ కత్యాల్..?

తన, పర భేదం లేకుండా టారిఫ్‌ల పేరుతో ప్రపంచ దేశాలను వణికించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడుకు అగ్రరాజ్య సుప్రీంకోర్టు బ్రేక్ వేసింది. ఆ సుంకాలేవీ చెల్లవంటూ సంచలన తీర్పు వెలువరించింది. ఈ తీర్పు రావడంలో భారత సంతతి న్యాయవాది నీల్ కత్యాల్ కీలక పాత్ర పోషించారు. ట్రంప్ టారిఫ్‌లను వ్యతిరేకిస్తూ పిటిషన్లు దాఖలు చేసిన చిన్న వ్యాపారులు, డెమోక్రాట్ పాలిత రాష్ట్రాల కూటమి తరఫున ఆయన సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. ఈ టారిఫ్‌ల కోసం ట్రంప్ 1977 నాటి అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టాన్ని (ఐఈఈపీఏ) ఉపయోగించడానికి వ్యతిరేకంగా నీల్ కత్యాల్ సుప్రీంకోర్టులో వాదించారు. ప్రతి వాణిజ్య భాగస్వామి పైనా సుంకాలు విధించడం అన్యాయమని, అది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. సుప్రీంతీర్పు



అనంతరం నీల్ మాట్లాడుతూ.. ''ఈ రోజు అమెరికా సుప్రీంకోర్టు చట్టపరమైన పాలన, అమెరికన్ ప్రజల భద్రత కోసం నిలబడింది. అధ్యక్షులు శక్తిమంతులే.. కానీ రాజ్యాంగం మరింత శక్తిమంతమైనదని న్యాయస్థానం నిరూపించింది. ప్రాథమిక విలువలను కాపాడింది. ఈ తీర్పు ఓ మైలురాయిగా నిలవనుంది'' అని ఆనందం వ్యక్తం చేశారు.

**ఎవరీ నీల్ కత్యాల్..**

నీల్ కత్యాల్ షికాగోలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు భారత్ నుంచి వచ్చిన వలసదారులు. తల్లి ప్రతిభ వైద్యురాలు. తండ్రి సురేందర్ ఇంజినీర్‌గా పనిచేశారు. యేల్ లా స్కూల్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన నీల్.. కెరీర్ తొలినాళ్లలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్టీఫెన్ బ్రేయర్ వద్ద క్లర్క్‌గా పనిచేశారు. 2010లో నాటి అమెరికా అధ్యక్షుడు ఒబామా హయాంలో యూఎస్ సొలిసిటర్ జనరల్‌గా వ్యవహరించారు. ఇప్పటివరకు అమెరికా సుప్రీంకోర్టులో 50కి పైగా కేసులు వాదించారు. గతంలో పలుమార్లు ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా నీల్ న్యాయస్థానాల్లో వాదించిన సందర్భాలు ఉన్నాయి. 2017లో ట్రంప్ తొలిసారి అధికారంలో కొన్ని దేశాలపై విధించిన ప్రయాణ ఆంక్షలకు వ్యతిరేకంగా నమోదైన కేసులను నీల్ వాదించారు. 'ఇంపీచ్: ది కేస్ అగైనెస్ట్ డొనాల్డ్ ట్రంప్' అనే పుస్తకాన్ని కూడా రచించారు. సంచలనం సృష్టించిన ఆఫ్రికన్ అమెరికన్ జార్జ్ ఫ్లాయిడ్ హత్య కేసులో మిన్నెసోటా రాష్ట్రం తరఫున ప్రత్యేక ప్రాసిక్యూటర్‌గా వాదించారు. అమెరికా న్యాయవిభాగం నుంచి అత్యున్నత పౌర పురస్కారాన్ని అందుకున్నారు.




## మూడుముళ్లు పడేదాకా ఫోను ముచ్చట్లు బంద్

ఈ రోజుల్లో పెళ్లి కుదిరిందంటే చాలు.. కాబోయే వధూవరులిద్దరూ ఫోన్లలో ముచ్చట్లు మొదలుపెట్టేసి అన్ని విషయాలు మాట్లాడేసుకొంటున్నారు. ఇటువంటి ధోరణితో చాలా సందర్భాల్లో అపోహలు తలెత్తి పెళ్లి దాకా రాకముందే విడిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌లోని బాలోద్ జిల్లాలో సేన్ సమాజం కీలక నిర్ణయం తీసుకుంది. తమ సామాజికవర్గానికి చెందిన వధూవరులిద్దరూ నిశ్చితార్థం తర్వాత పెళ్లయ్యేదాకా ఫోన్లలో మాట్లాడుకోవడంపై నిషేధం విధించింది. ఫోన్లు కుటుంబ సంబంధాలను విచ్ఛిన్నం చేస్తున్నాయని, అందుకే సమాజ సమావేశంలో ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకొన్నట్లు సేన్ కమ్యూనిటీ బాలోద్ జిల్లా అధ్యక్షుడు సంతోష్ కౌశిక్ తెలిపారు. నిశ్చితార్థం జరిగాక యువతీ యువకులు కుటుంబసభ్యుల సమక్షంలో మాట్లాడుకోవడంపై ఎటువంటి అభ్యంతరం లేదన్నారు.

## ప్రాణాంతక వైరస్.. ఆ పార్కులో 70 పులులు మృత్యువాత!

థాయ్‌లాండ్‌లోని ఓ ప్రైవేటు పార్కులో ప్రాణాంతక వైరస్ కలకలం రేపుతోంది. దీని కారణంగా కొన్ని రోజుల వ్యవధిలోనే 72 పులులు మృత్యువాత పడ్డాయి. పరీక్షించిన జంతు సంరక్షణ అధికారులు కనైన్ డిస్టెంపర్ వైరస్ కారణంగా ప్రాణాలు కోల్పోతున్నట్లు గుర్తించారు. తాత్కాలికంగా పార్కును మూసివేసి, సంరక్షణ చర్యలు చేపట్టారు. థాయ్‌లాండ్‌లోని ఫుకెట్‌లో టైగర్ కింగ్‌డమ్ పార్కుకు భారీ సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. ఇక్కడి పులులతో అతి దగ్గరగా ఫొటోలు దిగే అవకాశాన్ని నిర్వాహకులు కల్పిస్తున్నారు. అయితే, ఫిబ్రవరి తొలివారం నుంచి ఇక్కడి పులులు అనారోగ్యానికి గురై ప్రాణాలు కోల్పోతున్నట్లు అధికారులు గుర్తించారు. వాటి కళేబరాల నమూనాలను సేకరించి పరీక్షించగా.. శునక, పిల్లి జాతుల్లో కనిపించే సీడీవీ వైరస్ ఉన్నట్లు నిర్ధరించారు. దీంతోపాటు బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ తోడు కావడంతో భారీ సంఖ్యలో పులులు ప్రాణాలు కోల్పోతున్నాయనే అభిప్రాయానికి వచ్చారు. పిల్లులు, శునకాల మాదిరి కాకుండా పులులు అనారోగ్యానికి గురైనప్పుడు వాటి కారణాలను గుర్తించడం చాలా కష్టమని అధికారులు పేర్కొన్నారు. అవి అనారోగ్యంతో ఉన్నాయని గుర్తించే సమయానికే చాలా ఆలస్యమైనట్లేనని చెబుతున్నారు. ప్రస్తుతం అక్కడున్న మిగతా పులులను సమీప జిల్లాకు తరలించి, క్వారంటైన్‌లో ఉంచి పర్యవేక్షిస్తున్నట్లు పార్కు అధికారులు వెల్లడించారు.



## భక్తుల ఆగ్రహాన్ని ఎదుర్కోలేకే నాటకాలు ఆడుతున్నారు: మంత్రి మండిపల్లి

అమరావతి: శ్రీశైలం లడ్డూలోనూ కల్తీ నెయ్యి సరఫరా చేసి భక్తుల విశ్వాసాన్ని వైకాపా వొమ్ముచేసిందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మండిపడ్డారు. విజయ డెయిరీని కాదని రాజేష్ కార్పొరేషన్ ద్వారా కల్తీనెయ్యి సరఫరా చేయడం పాపమన్నారు. బ్రహ్మోత్సవాల్లో అలజడి సృష్టించేందుకు కుట్రలు పన్నిన వారిని వదిలిపెట్టేది లేదన్నారు. భక్తుల ఆగ్రహాన్ని ఎదుర్కోలేకే ఆ పార్టీ నేతలు నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. దేవాలయాల పవిత్రతను కాపాడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భక్తుల విశ్వాసంతో చెలగాటమాడిన వైకాపాకు ప్రజలే గుణపాఠం చెబుతారని అన్నారు.

## టిక్‌టాక్ సీఎం.. మీకెందుకీ లగ్జరీ విమానం...? మరియంపై మండిపాటు

ఆర్థికంగా తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న పాకిస్థాన్.. రుణాల కోసం అంతర్జాతీయ సంస్థలను వేడుకుంటోంది. ఇటువంటి సమయంలో అక్కడి పంజాబ్ రాష్ట్ర ముఖ్యమంత్రి మరియం నవాజ్ తీరు విమర్శలకు కారణమైంది. దాదాపు రూ.380 కోట్లతో లగ్జరీ విమానం కొనుగోలు చేయడమే ఇందుకు కారణం. విలాసవంతమైన జీవనశైలి కోసం ఆ వీఐపీ జెట్‌ను కొన్నారని ఆరోపిస్తున్న విపక్ష పార్టీలు ముఖ్యమంత్రి మరియం తీరుపై తీవ్ర



స్థాయిలో మండిపడుతున్నాయి. పాక్‌లోని పంజాబ్ ప్రభుత్వం వీఐపీల ప్రయాణం కోసమని ఇటీవల లగ్జరీ వసతులున్న గల్ఫ్‌స్ట్రీమ్ GVIIG500 విమానాన్ని కొనుగోలు చేసింది. 14 నుంచి 19 సీట్ల సామర్థ్యమున్న జెట్ కోసం దాదాపు రూ.380 కోట్లు (పాక్ కరెన్సీలో 11.7 బిలియన్) ఖర్చుపెట్టినట్లు అంచనా. మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కుమార్తె, పంజాబ్ సీఎం మరియం నవాజ్ వ్యక్తిగత వినియోగం కోసమే కొనుగోలు చేశారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. సీఎం విలాసవంతమైన జీవనశైలి కోసం వీఐపీ జెట్‌ను కొనుగోలు చేశారని పాకిస్థాన్ తెహ్రీక్‌ఎ ఇన్సాఫ్ (పీటీఐ) సీనియర్ నేత మూనిస్ ఆరోపించారు. ఓవైపు ప్రభుత్వరంగ విమానయాన సంస్థ 'పీఐఏ'ను చౌకగా అమ్మేస్తున్న ప్రభుత్వం.. టిక్‌టాక్ సీఎం కోసం అంతకన్నా ఎక్కువ ఖర్చుపెట్టడం సిగ్గుచేటు అని అన్నారు. దాదాపు 13 కోట్ల జనాభా ఉన్న పంజాబ్‌లో.. తాగునీరు, రోడ్డు, వైద్యం వంటి కనీస సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రికి ఒక్క విమానం కోసమే రూ.వందల కోట్లు ఖర్చు పెడుతున్నారని మూనిస్ విమర్శించారు.

## ఏఐ స్టార్టప్ ఆంథ్రోపిక్ కొత్త ఫీచర్ ప్రకటన..

# సైబర్ సెక్యూరిటీ షేర్‌లు ఢమాల్..!




**న్యూఢిల్లీ:** అగ్రరాజ్యం అమెరికాకు చెందిన ఏఐ స్టార్టప్ సంస్థ ఆంథ్రోపిక్ వరుస సంచలనాలు సృష్టిస్తోంది. కొద్దిసేపటి క్రితం ఆ సంస్థ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసిన పోస్ట్‌తో సైబర్ సెక్యూరిటీ షేర్లు కుప్పకూలాయి. అమెరికా మార్కెట్‌లో ఆయా కంపెనీల స్టాక్స్ భారీగా పతనమయ్యాయి.

సైబర్ సెక్యూరిటీ కోసం ఆంథ్రోపిక్ కొత్త ఫీచర్ 'క్లాడ్ కోడ్ సెక్యూరిటీ'ని ప్రకటించింది. ఈ క్లాడ్‌కోడ్ సెక్యూరిటీ సాఫ్ట్‌వేర్ కోడ్‌బేస్‌లను స్కాన్ చేస్తుంది. అందులోని లోపాలను గుర్తించి, వాటిని సరిదిద్దేందుకు పరిష్కారాలను సిఫార్సు చేస్తుంది. దాంతో కోడింగ్ ప్రాసెస్‌లోనే డెవలపర్లు భద్రతాపరమైన లోపాలను గుర్తించి, పరిష్కరించుకోవడానికి వీలు కలుగుతుంది.

సంప్రదాయ పద్ధతుల్లో గుర్తించని లోపాలను కనుగొనేందుకు ఈ టూల్ ఉపయోగపడుతుందని ఆంథ్రోపిక్ వెల్లడించింది. ఈ ఏఐ ఆధారిత ఫీచర్ ప్రస్తుతం పరిశీలన దశలో ఉంది. ఆంథ్రోపిక్ పోస్టుతో సైబర్ సెక్యూరిటీ సంస్థల షేర్లు 5 శాతం నుంచి 9 శాతం మేర పతనమయ్యాయి. సైబర్‌సెక్యూరిటీతో సంబంధం ఉన్న సాఫ్ట్‌వేర్ సంస్థలైన గిట్‌ల్యాబ్, జెఫ్రాగ్ షేర్లు కూడా పడిపోయాయి. గ్లోబల్ ఎక్స్ సైబర్ సెక్యూరిటీ ఈటీఎఫ్ 5 శాతం పతనమైంది. మొత్తంగా మదుపర్ల సంపద 10 బిలియన్ డాలర్ల మేర ఆవిరైందని మార్కెట్ వర్గాలు తెలిపాయి.


## మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు!

**దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో స్వల్ప పెరుగుదల**

**హైదరాబాద్‌లో రూ.1.57 లక్షలు దాటిన 10 గ్రాముల పసిడి**

**అంతర్జాతీయ పరిణామాలే ధరల పెరుగుదలకు కారణం**

**22 క్యారెట్ల బంగారం ధర రూ.1.44 లక్షల పైకి**



**న్యూఢిల్లీ:** దేశంలో బంగారం ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ఈ వారం మధ్యలో కాస్త తగ్గుముఖం పట్టిన పసిడి, శనివారం ఉదయం మరోసారి పెరిగింది. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరల్లో స్వల్ప పెరుగుదల నమోదైంది. తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్య నగరాలైన హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం (10 గ్రాములు) ధర రూ.1,57,380 వద్ద స్థిరపడింది.

ఇక ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,44,260గా ఉంది. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ కథనం ప్రకారం, శుక్రవారంతో పోలిస్తే 24 క్యారెట్ల బంగారంపై రూ.880, 22 క్యారెట్లపై రూ.800 మేర పెరిగింది. దేశంలోని ఇతర నగరాల్లోనూ ఇదే ధోరణి కనిపించింది. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,57,520 ఉండగా, ముంబైలో రూ.1,57,370, చెన్నైలో రూ.1,57,300గా నమోదైంది.

అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకుంటున్న పరిణామాలే బంగారం ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ నిర్ణయాలు, డాలర్ విలువలో మార్పులు, ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా పెట్టుబడిదారులు బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తున్నారు. ఈ కారణంగానే పసిడికి డిమాండ్ పెరిగి ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ వర్గాలు వివరిస్తున్నాయి. ఈ ధరల పెరుగుదల సాధారణ వినియోగదారులపై, ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్‌లో బంగారం కొనుగోలు చేసే వారిపై ప్రభావం చూపనుంది.

## మైక్రోసాఫ్ట్ గేమింగ్ సీఈఓగా ఆశా శర్మ



**న్యూఢిల్లీ:** టెక్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ గేమింగ్ విభాగంలో భారత సంతతి టెకీకి ఉన్నత పదవి లభించింది. కొత్త సీఈవోగా ఆశా శర్మను సంస్థ నియమించింది. ఇప్పటివరకు ఈ స్థానంలో ఉన్న ఫిల్ స్పెన్సర్ పదవీవిరమణ చేయడంతో.. ఆ స్థానంలో గేమింగ్ డివిజన్‌కు సీఈఓ, వైస్ ప్రెసిడెంట్‌గా ఆశా శర్మ బాధ్యతలు చేపట్టనున్నారు. మైక్రోసాఫ్ట్ గేమింగ్ ఆదాయ వృద్ధి మందగించడం, గేమింగ్ కంటెంట్ కోసం ప్రపంచ మార్కెట్‌లో తీవ్రమైన పోటీ వంటి సవాళ్లను ఆమె ఎదుర్కోనున్నారు.

మైక్రోసాఫ్ట్‌లో చేరడానికి ముందు ఆశా శర్మ పలు అతిపెద్ద అంతర్జాతీయ టెక్నాలజీ కంపెనీలలో ఉన్నత పదవుల్లో పని చేశారు. గేమింగ్ సీఈఓగా బాధ్యతలు చేపట్టడానికి ముందు మైక్రోసాఫ్ట్‌లోని కృత్రిమ మేధ విభాగంలో సీనియర్ అధికారిగా విధులు నిర్వర్తించారు. ఆశా శర్మతో పాటు ఇతర సీనియర్ అధికారుల స్థానాల్లోనూ మార్పులు చేసినట్లు టెక్ సంస్థ వెల్లడించింది. గేమ్ స్టూడియోలు, టైటిల్‌లను పర్యవేక్షించే చీఫ్ కంటెంట్ ఆఫీసర్‌గా సీనియర్ అధికారి మాట్ బూటీకి పదోన్నతి కల్పించినట్లు తెలిపింది.

ఆశా శర్మ మిన్నెసోటా విశ్వవిద్యాలయంలోని కార్ల్‌సన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి బిజినెస్‌లో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ చేశారు. తన కెరీర్ ప్రారంభంలో ఆశా మైక్రోసాఫ్ట్ మార్కెటింగ్‌లో పని చేసి.. 2013లో సంస్థ నుంచి బయటకు వెళ్లారు. అనంతరం వివిధ అంతర్జాతీయ టెక్ కంపెనీలలో ఉన్నత స్థానాల్లో విధులు నిర్వర్తించారు. రెండేళ్ల క్రితం మైక్రోసాఫ్ట్‌లోని కోర్ ఏఐ విభాగంలో ఉన్నతాధికారిగా తిరిగి చేరారు.



## ఆస్ట్రేలియా గడ్డపై

# గర్జించిన భారత్..

**మంధాన, శ్రేయాంక జోరుతో పొట్టి సిరీస్ కైవసం..!**

**సిడ్నీ:** ఆస్ట్రేలియాను వారి సొంతగడ్డపై ఓడించడం ఏ జట్టుకైనా సవాలే. ప్రపంచంలోనే మేటి జట్టైన ఆసీస్‌ను భారత మహిళల జట్టు చిత్తుగా ఓడించింది. అడిలైడ్‌లో 17 పరుగులతో గెలిచి పొట్టి సిరీస్ కైవసం చేసుకుంది. నిర్ణయాత్మక మ్యాచ్‌లో స్మృతి మంధాన(82), జెమీమా రోడ్రిగ్స్(59)ల విధ్వసంతో ఆసీస్‌కు సవాల్ విసిరిన టీమిండియాకు ఆతిథ్య జట్టు బదులివ్వలేకపోయింది. అష్లే గార్డ్‌నర్ (57) అర్ధ శతకంతో రాణించినా శ్రేయాంక పాటిల్(3-22) వికెట్ల వేటతో దెబ్బతీసింది. ఫలితంగా భారీ ఛేదనలో 159కే పరిమితమైన కంగారూ టీమ్ సిరీస్ కోల్పోయింది.

వన్డే వరల్డ్‌కప్ ఛాంపియన్‌గా విదేశీ పర్యటనలో తొలి సీరస్ గెలుపొందింది భారత జట్టు. ఆస్ట్రేలియా పర్యటనను విజయంతో ఆరంభించిన భారత జట్టు టీ20 సిరీస్‌లో పంజా విసిరింది. తొలి పోరులోనే ఆసీస్‌కు షాకిచ్చిన టీమిండియా.. రెండో మ్యాచ్‌ను చేజేతులా వదిలేసింది. అయితే.. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన ఆల్‌రౌండ్ షోతో



అదరగొట్టింది. ఓపెనర్ స్మృతి మంధాన(82) అంతర్జాతీయ క్రికెట్‌లో 70వ అర్ధ శతకంతో.. జెమీమా రోడ్రిగ్స్(59) విధ్వంసంతో ఆతిథ్య జట్టు బౌలర్లు నీరుగారిపోయారు.

భారీ ఛేదనలో ఆస్ట్రేలియాను శ్రేయాంక పాటిల్(03-22) ఆదిలోనే దెబ్బకొట్టింది. గత మ్యాచ్‌లో చెలరేగిన జార్జియా వోల్(10) ను తను ఔట్ చేయగా ఫొబే లిచ్‌ఫీల్డ్(26)ను శ్రీ చరణి వెనక్కి పంపింది. అష్లీ గార్డ్‌నర్(57) హాఫ్ సెంచరీతో పోరాడినా శ్రీచరణి(3-32), అరుంధతి రెడ్డి(2-35)లు వికెట్ల వేటతో ఒత్తిడి పెంచారు. ఆఖర్లో అనాబెల్ సథర్‌లాండ్(14)ను వెనక్కి పంపిన చరణి ఆసీస్ ఓటమిని పరిపూర్ణం చేసింది. ఆస్ట్రేలియా గడ్డపై భారత జట్టుకు ఇది రెండో టీ20 సిరీస్ విజయం. మెరుపు అర్ధ శతకంతో టీమిండియా గెలుపులో కీలకమైన మంధాన 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికైంది.

### సెంచరీ భాగస్వామ్యంతో..

తొలుత కంగారూ బౌలర్లకు ఓపెనర్ స్మృతి మంధాన(82), జెమీమా రోడ్రిగ్స్(59) చుక్కలు చూపించారు. 19 పరుగులకే షఫాలీ వర్మ(7)ను ఔట్ చేసిన ఆసీస్ బౌలర్ల ఆనందాన్ని ఆవిరి చేస్తూ మంధాన, జెమీమా క్రీజులో పాతుకుపోయారు. మంధాన బౌండరీలతో చెలరేగగా.. జెమీమా క్లాస్ ఇన్నింగ్స్‌తో అలరించింగింది.

అనుభవజ్ఞులైన ఈ ఇద్దరూ ఆసీస్ బౌలర్లకు ఏమాత్రం అవకాశమివ్వకుండా స్కోర్‌బోర్డును ఉరికించారు. రెండో వికెట్‌కు సెంచరీ (121 పరుగులు) భాగస్వామ్యంతో భారీ స్కోర్‌కు బాటలు వేశారు. మంధాన ఔటయ్యాక బ్యాటింగ్ ఆర్డర్లో ముందొచ్చిన రీచా ఘోష్(18) తన స్టయిల్ ఆటతో రెచ్చిపోగా భారత్ 6 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది.

## సూపర్ 8లోనూ

# శాంసన్ బెంచ్ మీదే..

**కూర్పుపై స్పష్టతనిచ్చిన సారథి..!**

**న్యూఢిల్లీ:** భారత జట్టుకు ఆడాలంటే ప్రతిభకు కొదవ లేకున్నా.. అవకాశాల్ని ఉపయోగించుకోగల నేర్పు ఉండాలి. ద్వైపాక్షిక సిరీస్‌లో, ఐపీఎల్‌లో దంచేసే సంజూ శాంసన్‌కు ఈ మాట నూరు శాతం వర్తిస్తుంది. టీ20ల్లో



మూడు సెంచరీలు బాదిన శాంసన్ వరల్డ్‌కప్‌లో బెంచ్‌కే పరిమితమవుతున్నాడు. సూపర్ 8లోనైనా అవకాశం రాకపోతుందా? అనే నమ్మకంతో సంజూ నెట్స్‌లో తీవ్రంగా సాధన చేశాడు. అయినా సరే సూపర్ 8 తొలి మ్యాచ్‌లో సంజూను ఆడించడం లేదని కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్పష్టం చేశాడు. తుది జట్టు కూర్పుపై మాట్లాడిన సూర్య.. వరుసగా విఫలమవుతున్న అభిషేక్ శర్మ స్థానంలో సంజూను తీసుకోవడం లేదని తెలిపాడు. ఓపెనర్‌గా ఎంపికైన ఈ పవర్ హిట్టర్ సన్నాహక సిరీస్‌లో న్యూజిలాండ్‌పై ఘోరంగా విఫలమయ్యాడు. అభిషేక్ శర్మకు అస్వస్థత కారణంగా నమీబియాపై ఆడినా సున్నాకే ఔటయ్యాడు. మరో ఎండ్‌లో ఇషాన్ కిషన్ విధ్వంసక ఆటతో.. మ్యాచ్ విన్నర్‌గా అవతరించి తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. అభిషేక్ మూడు డకౌట్లతో నిరాశపరిచిన వేళ.. సూపర్ 8లో శాంసన్‌కు చోటివ్వాలని.. టాపార్డర్‌లో ఒక రైట్‌హ్యాండ్ బ్యాటర్ ఉంటే మేలని విశ్లేషకులు సూచిస్తున్నారు.

# భారత్ సెమీస్ చేరదు

**పాక్ మాజీ బౌలర్ మొహమ్మద్ ఆమిర్**

**సూపర్ 8లో భారత్ తేలిపోతుందన్న మహమ్మద్ ఆమిర్**

**భారత్ సెమీస్ దాకా రావడం అసాధ్యమని వ్యాఖ్య**

**సూపర్ 8లో జింబాబ్వే లాంటి డేంజర్ జట్లు ఉన్నాయన్న ఆమిర్**




**న్యూఢిల్లీ:** పాకిస్థాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ ఆమిర్ భారత జట్టు ప్రదర్శనపై తీవ్ర విమర్శలు చేశాడు. గ్రూప్ దశలో భారత్ అద్భుతంగా రాణించినా... సూపర్ 8లో తేలిపోతుందని, సెమీ ఫైనల్ దాకా రావడం అసాధ్యమని హేళన చేశాడు. గ్రూప్ దశలో పాకిస్థాన్‌పై మాత్రమే భారత బ్యాటర్లు బాగా ఆడారని చెప్పాడు. యూఎస్ఏ, నమీబియా, నెదర్లాండ్స్ లాంటి చిన్ని జట్లపై ఒకరిద్దరు మాత్రమే రాణించారని అన్నాడు. పసికూన జట్లపై గెలవడాన్ని గొప్పగా భావించకూడదని చెప్పాడు. సూపర్ 8లో జింబాబ్వే లాంటి డేంజర్ జట్లు ఉన్నాయని... భారత్ ఇక్కడే ఓడిపోతుందని ఆమిర్ అన్నాడు. దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ సెమీ ఫైనల్ దాకా వస్తాయని, భారత్ మాత్రం సెమీ ఫైనల్ చేరదని చెప్పాడు.

## తొలి సూపర్ 8 మ్యాచ్ రద్దు..

# షాక్‌లో పాక్, న్యూజిలాండ్..!

**న్యూఢిల్లీ:** పొట్టి ప్రపంచకప్ సూపర్ 8 ఆరంభ పోరులో విజయంపై కన్నేసిన పాకిస్థాన్, న్యూజిలాండ్‌కు బిగ్ షాక్. వర్షం కారణంగా మ్యాచ్ ఒక్కబంతి కూడా పడకుండానే రద్దయ్యింది. టాస్ పడడమే ఆలస్యం ప్రేమదాస స్టేడియాన్ని ముంచెత్తిన వర్షం.. ఎంతకూ తగ్గలేదు. కనీసం ఐదు ఓవర్ల ఆటైనా జరిపించాలనుకున్నా సాధ్యపడలేదు. వర్షం బ్రేకివ్వకపోవడంతో నాలుగ్గంటలే వేచిచూసిన అంపైర్లు చివరకు ఆటను రద్దు చేశారు.

లీగ్ దశలో ఒక ఓటమితో గ్రూప్ బీలో చోటు దక్కించుకున్న పాకిస్థాన్, న్యూజిలాండ్ జట్ల జట్లకు వర్షం ఊహించని షాకిచ్చింది. శనివారం ప్రేమదాస స్టేడియంలో జరగాల్సిన సూపర్ 8 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. దాంతో.. విజయంతో రెండు పాయింట్లు సాధించాలనుకున్న ఇరుజట్లకు అంపైర్లు చెరొక పాయింట్ కేటాయించారు. ఊహించిని పరిణామంతో పాక్, కివీస్ ఆటగాళ్లు కంగుతిన్నారు.



### టాస్ పడగానే..

ప్రపంచకప్ మ్యాచ్‌కు వర్షం అడ్డుపడడం ఇది రెండోసారి. లీగ్ దశలో గ్రూప్ బీలోని ఐర్లాండ్ జింబాబ్వే మ్యాచ్‌ను అడ్డుకున్న వరుణుడు.. చివరకు ఆస్ట్రేలియా నిష్క్రమించడానికి కారణమయ్యాడు. ఈసారి సూపర్ 8లో మొదటి మ్యాచ్‌కే అంతరాయం కలిగిస్తున్నాడు. ప్రేమదాస స్టేడియంలో టాస్ గెలిచిన పాక్ సారథి సల్మాన్ అఘా బ్యాటింగ్ ఎంచుకున్న కాసేపటికే.. చినుకులు షురూ అయ్యాయి. సాయంత్రం 6:30 గంటలకు ముందు నుంచే అప్పటికే ఆకాశం మేఘావృతమై ఉండడంతో అప్రమత్తంగా ఉన్న సిబ్బంది వర్షం మొదలవ్వగానే కవర్లతో పిచ్‌ను, ఔట్‌ఫీల్డ్‌ను పూర్తిగా కప్పేశారు.

తొలి మ్యాచ్ వర్షార్పణం కావడంతో తదుపరి రెండు మ్యాచులు ఇరుజట్లకు కీలకం కానున్నాయి. ఫిబ్రవరి 24న పాకిస్థాన్ పల్లెకెలె స్టేడియంలో రాత్రి 7 గంటలకు ఇంగ్లండ్‌ను ఢీకొట్టనుంది. ఫిబ్రవరి 28 ఆతిథ్య శ్రీలంకతో పల్లెకెల్ స్టేడియంలో రాత్రి 7 గంటలకు పాక్ తలపడనుంది. న్యూజిలాండ్ తమ రెండో మ్యాచ్‌లో ఫిబ్రవరి 25న ప్రేమదాస స్టేడియంలో రాత్రి 7 గంటలకు శ్రీలంకతో కొలంబోతలపడుతుంది. ఫిబ్రవరి 27న ఇదే మైదానంలో ఇంగ్లండ్, బ్లాక్ క్యాప్స్ అమీతుమీ తేల్చుకోనున్నాయి.

MOVIE TIME



## కోటి రూపాయలు పారితోషికం అందుకుంటుంది

టాకీస్: 'ధమాకా' తర్వాత హీరోయిన్ గా శ్రీలీల ఖాతాలో ఒక్క హిట్టు కూడా పడలేదు. బాలకృష్ణ-అనిల్ రావిపూడి కాంబినేషన్లో వచ్చిన 'భగవంత్ కేసరి' హిట్ అయినా.. అందులో శ్రీలీల హీరోయిన్ కాదు. అయినప్పటికీ దాని సక్సెస్ క్రెడిట్ శ్రీలీల ఖాతాలో పడలేదు.'స్కంద' 'ఆదికేశవ' 'ఎక్స్ట్రా ఆర్డియనరీ మెన్' 'గుంటూరు కారం' 'రాబిన్ హుడ్' 'జూనియర్' 'మాస్ జాతర' 'పరాశక్తి' ఇలా అన్నీ డిజాస్టర్లే. వేరే హీరోయిన్ ట్రాక్ రికార్డు ఇలా ఉంటే.. ఈపాటికి దుకాణం సర్దేసేది. కానీ శ్రీలీల ఆ విషయంలో లక్కీ అనే చెప్పాలి. ఇన్ని డిజాస్టర్లు పడినప్పటికీ.. ఆమె డిమాండ్ ఏమీ తగ్గలేదు. ఇప్పటికీ ఆమె కోటి రూపాయలు పారితోషికం అందుకుంటుంది. ప్రస్తుతం ఆమె హిందీలో 2 సినిమాల్లో నటిస్తుంది.అవి రెండూ క్రేజీ ప్రాజెక్టులే. మరోవైపు తమిళంలో క్రేజీ ఆఫర్లు అందుకుంటుంది. ధనుష్ 50వ సినిమాలో సాయి పల్లవితో పాటు మరో హీరోయిన్ గా నటిస్తుంది. అలాగే అజిత్ హీరోగా అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాలో కూడా హీరోయిన్ గా నటిస్తుంది.మరోవైపు పవన్ కళ్యాణ్ కి జోడీగా 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాలో నటించింది. హరీష్ శంకర్ దర్శకత్వం వహించిన సినిమా అది. మార్చి 26న రిలీజ్ అవుతుంది. ఈ సినిమాకి సంబంధించి శ్రీలీల తన పాత్రకి డబ్బింగ్ చెప్పడం కూడా పూర్తయ్యింది. ఈ ఒక్క సినిమా హిట్ అయితే.. శ్రీలీల ఫ్లాప్స్ నుండి బయటపడినట్టే. దర్శకుడు హరీష్ శంకర్ కి కూడా ఫ్లాప్స్ లో ఉన్న హీరోయిన్స్ ని బయటపడేసిన ట్రాక్ రికార్డ్ ఉంది.




## పవర్‌ఫుల్ లాయర్‌గా తాప్సీ పన్ను

టాకీస్: ఒకప్పుడు తన అందాలతో తెలుగు ప్రేక్షకులను అలరించారు ఉత్తరాది భామ తాప్సీ పన్ను. కానీ అందరు హీరోయిన్ల మాదిరిగానే ఆమెకు బాలీవుడ్‌పై మోజు పుట్టి అక్కడే సెటిలైపోయింది. ఒకటి రెండు హిట్లు తప్పించి హిందీ చిత్ర పరిశ్రమలో తాప్సీ కెరీర్‌లో పెద్దగా మెరుపులు లేవు. కానీ ఏదో కిందా మీదా పడుతూ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు తాప్సీ. దోబారా, తడ్కా, బ్లర్, ధక్ ధక్, డూంకీ, ఖేల్ ఖేల్ మై తదితర సినిమాల లో ఆమె నటించారు. తాజాగా తాప్సీ పన్ను లీడ్ రోల్‌లో నటించిన చిత్రం అస్సీ. మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాల బ్యాక్‌డ్రాప్‌లో యదార్థ ఘటనల తెరకెక్కిన లేడీ ఓరియెంటెడ్ మూవీ అస్సీ. కోర్ట్ డ్రామాగా తెరకెక్కి న ఈ చిత్రంలో తాప్సీ పన్ను పవర్‌ఫుల్ లాయర్‌గా నటించారు.
ఫిబ్రవరి 20వ తేదీన ఈ సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చింది. టీ సిరీస్ ఫిల్మ్స్, బెనారస్ మీడియా వర్క్స్ బ్యానర్‌పై భూషణ్ కుమార్, కృషన్ కుమార్, అనుభవ్ సిన్హాలు సంయుక్తంగా అస్సీ మూవీని నిర్మించగా.. అనుభవ్ సిన్హా దర్శకత్వం వహించారు. తాప్సీతో పాటు కని కుస్రుతి, రేవతి, మనోజ్ పహ్వా, కుముద్ మిశ్రా, మహమ్మద్ జీషన్ ఆయూబ్, సత్యజిత్ శర్మ, విపుల్ గుప్తా తదితరులు కీలకపాత్రలు పోషించారు. సీతా పహ్వా, సుప్రీయ పాఠక్, నసీరుద్దీన్ షాలు గెస్ట్ రోల్‌లో అలరించారు. ఈవారం ముల్లిగన్ ఈ సినిమాకు సినిమాటో గ్రాఫర్‌గా వ్యవహరించగా.. అమర్జిత్ సింగ్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తించారు. రంజిత్ బరత్ సంగీత దర్శకత్వం వహించారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల పారితోషం, ప్రొడక్షన్ కాస్ట్, ప్రమోషనల్ కార్యక్రమాలతో కలిపి అస్సీ మూవీకి 40 కోట్ల రూపాయల బడ్జెట్ అయ్యింది. టీజర్, ట్రైలర్ తదితర ప్రమోషనల్ కార్యక్రమాలతో అస్సీ మూవీకి ఓ మాదిరిగా థియేట్రికల్, నాన్ థియేట్రికల్ బిజినెస్ జరిగినట్లుగా వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా లాభాల్లోకి రావాలంటే బాక్సాఫీస్ వద్ద 80 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్ రాబట్టాల్సి ఉందని ట్రేడ్ పండితులు వాల్యూ నిర్దేశించారు.

## స్టార్ హీరో హీరోయిన్లకు మించిన క్రేజ్

టాకీస్: ప్రస్తుతం తెలుగు బుల్లితెరపై దూసుకుపోతున్న సీరియల్ గుండె నిండా గుడిగంటలు. అత్యధిక టీఆర్పీ రేటింగ్ తో ఈ సీరియల్ రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఫ్యామిలీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సాధారణ మధ్య తరగతి కుటుంబ కథతో సాగుతున్న ఈ సీరియల్ ప్రతి ఒక్కరికి కనెక్ట్ అవుతుంది. అందుకే ఈ సీరియల్ కు రోజు రోజుకీ విపరీతమైన రెస్పాన్స్ వస్తుంది. ఇక ఇందులో ప్రధాన పాత్రలు బాలు, మీనా జోడికి సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉందంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా మీనా గురించి చెప్పుకుంటే.. అందంతోపాటు పద్దతిగా చీరకట్టులో కనిపిస్తూ అద్భుతమైన నటనతో కట్టిపడేస్తుంది. మీనా అసలు పేరు అమూల్య గౌడ. కన్నడ సినీరంగానికి చెందిన ఈ ముద్దుగుమ్మకు తెలుగులో ఫాలోయింగ్ ఎక్కువే. సీరియల్లో పద్దతిగా కనిపించే అమూల్య.. సోషల్ మీడియాలో మాత్రం గ్లామరస్ ఫోటోలతో రచ్చ చేస్తుంది. నెట్టింట ఈ అమ్మడు చేసే అరాచకం గురించి చెప్పక్కర్లేదు. మైసూర్ కు చెందిన అమూల్య గౌడ.. దాదాపు పదేళ్ల క్రితం సినీప్రయాణం స్టార్ట్ చేసింది. కన్నడ సీరియల్ స్వాతి ముత్తుతో నటిగా తెరంగేట్రం చేసింది. ఆ తర్వాత కోమలి సీరియల్ ద్వారా ఫేమ్ సంపాదించుకుంది. కన్నడలో పలు సీరియల్స్ చేసిన ఈ అమ్మడు.. కార్తీక దీపం సీరియల్లో శౌర్య పాత్రతో తెలుగు ఆడియన్స్ ముందుకు వచ్చింది. ఇందులో రౌడీ బేబీగా మరింత పాపులర్ అయ్యింది.ఆ తర్వాత గుండె నిండా గుడిగంటలు సీరియల్లో మీనా పాత్రతో మరింత పాపులర్ అయ్యింది. ఈ సీరియల్ ఆమె కెరీర్ టర్నింగ్ పాయింట్ అయ్యింది. ప్రస్తుతం ఈ సీరియల్ విజయవంతంగా దూసుకుపోతుంది. ఇక ఇప్పుడు ఆమె సోషల్ మీడియాలో గ్లామర్ లుక్స్ తో హీటెక్కిస్తుంది. ఇదిలా ఉంటే.. అమూల్య గౌడ ఒక్క ఎపిసోడ్ కోసం రూ.30 నుంచి రూ.35 వేలు తీసుకుంటుందట. ఇప్పుడు ఈ విషయం తెలిసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు.



## ఫంకీ క్లోజింగ్ కలెక్షన్లు...

టాకీస్: సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్యలు నిర్మించిన చిత్రం ఫంకీ. విశ్వక్‌సేన్, కాయదు లోహర్‌లు జంటగా నటించగా.. జాతిరత్నాలు ఫేమ్ అనుదీప్ కేవీ దర్శకత్వం వహించారు. వీకే నరేష్, వీటీవీ గణేష్, సంపత్ రాజ్, ఈశ్వరి రావు, రఘుబాబు, మురళీధర్ గౌడ్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ డైరెక్షన్ చేశారు.. నవీన్ నూలి ఎడిటర్‌గా, సురేష్ సారంగం సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించారు. వాలంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 13వ తేదీన ఫంకీ మూవీ వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో ఫంకీ బడ్జెట్ ఎంత? ప్రీ రిలీజ్ బిజినెస్ ఎంత? బ్రేక్‌ఈవెన్ టార్గెట్ ఎంత? విశ్వక్‌సేన్ మూవీకి క్లోజింగ్ కలెక్షన్స్ ఎంత? ఫంకీకి లాభమెంత? నష్టమెంత? అనేది పరిశీలిస్తే...నటీనటులు, సాంకేతిక నిపుణుల



రెమ్యునరేషన్, ప్రొడక్షన్ కాస్ట్, ప్రమోషనల్ ఖర్చులు కలిపి ఫంకీ సినిమాకు దాదాపు 25 కోట్ల రూపాయల బట్జెట్ అయ్యింది. ఇక ఈ మూవీ ప్రీ రిలీజ్ బిజినెస్ విషయాన్ని పరిశీలిస్తే.. నైజాం థియేట్రికల్ రైట్స్ 4 కోట్ల రూపాయలు, సీడెడ్ థియేట్రికల్ రైట్స్ 1.25 కోట్ల రూపాయలు, ఆంధ్రా థియేట్రికల్ రైట్స్ 5 కోట్ల రూపాయలు చొప్పున తెలుగు రాష్ట్రాల్లో 10.25 కోట్ల రూపాయల బిజినెస్ చేసింది ఫంకీ. కర్ణాటక ం రెస్టాఫ్ ఇండియా థియేట్రికల్ రైట్స్ 75 లక్షల రూపాయలు, ఓవర్సీస్ థియేట్రికల్ రైట్స్‌ను మోక్షా మూవీస్ 2 కోట్ల రూపాయలకు దక్కించుకుంది. దాంతో వరల్డ్ వైడ్‌గా ఫంకీ మూవీ ప్రీ రిలీజ్ బిజినెస్ 13 కోట్ల రూపాయల మేర చేసింది. విశ్వక్‌సేన్ మూవీ లాభాల్లోకి రావాలంటే బాక్సాఫీస్ వద్ద 14 కోట్ల రూపాయల షేర్, 28 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్ రాబట్టాల్సి ఉందని ట్రేడ్ పండితులు వాల్యూ నిర్దేశించారు.

## విష్ణు విన్యాసానికి లైన్ క్లియర్..



టాకీస్: శ్రీవిష్ణు నటించిన 'మృత్యుంజయ్', 'విష్ణు విన్యాసం' చిత్రాలు ఒకే రోజు వ్యవధిలో విడుదల కానుండటంతో ట్రేడ్ వర్గాల్లో టెన్షన్ నెలకొన్న సంగతి తెలిసిందే. అయితే ఈ క్లాష్‌ను నివారించడానికి మేకర్స్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మృత్యుంజయ్ చిత్రాన్ని వాయిదా వేశారు. కొత్త విడుదల తేదీని ప్రకటించారు. మరోవైపు విష్ణు విన్యాసం సినిమాను ఒక రోజు ముందుగా రిలీజ్ చేస్తున్నారు. దీనివల్ల శ్రీవిష్ణు ఒక సినిమా ప్రమోషన్స్ ముగించుకుని, మరో సినిమా ప్రచారానికి సమయం కేటాయించే అవకాశం లభించింది. శ్రీవిష్ణు హీరోగా నటించిన రెండు సినిమాలు ఒకే సమయంలో, ఒక్క రోజు గ్యాప్ లో విడుదలకు సిద్ధమైన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 27న మృత్యుంజయ్.. 28న విష్ణు విన్యాసం మూవీని రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ అఫిషియల్ గా అనౌన్స్ చేశారు. ఇలా ఒకే హీరోకి చెందిన రెండు చిత్రాలు ఒకేసారి థియేటర్లలోకి రావడం అనేది చాలా అరుదుగా జరుగుతుంది. అందుకే గత కొన్ని రోజులుగా 'శ్రీవిష్ణు జం శ్రీవిష్ణు' అంటూ పెద్ద ఎత్తున చర్చలు జరిగాయి. అయితే ఇలాంటి సంకట పరిస్థితి నుంచి శ్రీవిష్ణు బయటపడ్డారు. గతంలో నందమూరి బాలకృష్ణ నటించిన బంగారు బుల్లోడు, నిప్పురవ్వ సినిమాలు ఒకే రోజు రిలీజ్ అవ్వగా.. వాటిల్లో ఒకటి హిట్టవ్వగా, మరొకటి ఫ్లాప్ అయింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.